ప్రజాశక్తి

శుక్రవారం 21 ఏప్రిల్ 2023

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

రాజకీయ నాయకులా..

అయితే వదిలేస్తాం..!

అక్రమ నిర్మాణాలు సాగుతున్న ప్రాంతం

- అక్రమ నిర్మాణాలపై అధికారుల చోద్యం
- ఇదీ..జివిఎంసి పట్టణ ప్రణాళిక విభాగం తీరు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'ప్రభుత్వ స్థలాలా ? ప్రైవేట్ స్థలాలా ? ఏవైనా సరే.. అనుమతుల్లేకుండా అక్రమ నిర్మాణాలు చేసుకోండి. అటు పిమ్మట మా దృష్టికి వస్తే.. మేం చూస్తే ఫైన్ వేస్తాం... నోటీసు ఇస్తాం... ఈలోగా అంతా మీదే ఇష్టారాజ్యం' అన్నట్టు జివిఎంసి పట్టణ ప్రణాళిక అధికారుల వ్యవహార శైలి ఉంది. అయితే ఇది అందరి విషయంలోనూ కాదు సుమా!.. కేవలం రాజకీయ నాయకులకు మాత్రమే. అదీ అధికార పార్టీ నేతలకైతే ఎలాంటి ముందస్తు అనుమతులూ అవసరం లేదు. విశాఖ నగరంలోని మధురవాడ జివిఎంసి జోన్ పరిధి, గుడ్లవానిపాలెం సర్వే నెంబరు 149, 150ల మధ్య సాగుతున్న అక్రమ నిర్మాణాలను ఈ రకంగానే పట్టణ ప్రణాళిక విభాగం వదిలేసింది.

అక్రమ కట్టడాల జోరు సాగుతోందిలా..

చినగదిలి మండల పరిధిలోని సాగర్‌నగర్ - గుడ్లవానిపాలెం 149, 150 సర్వే నెంబర్ల మధ్యలో ఆరు షాపుల నిర్మాణాన్ని స్థానిక అధికార పార్టీ నాయకుడు ఒకరు చేపట్టారు. గతంలో 150 సర్వే నెంబరులోగల ఒక నిర్మాణాన్ని గెడ్డ (ప్రభుత్వ భూమి) అంటూ రెవెన్యూ అధికారులు నిలిపివేశారు. నిర్మాణాన్ని చాలా వరకూ అప్పట్లో తొలగించారు. తాజాగా 149లో తాను నిర్మాణం చేస్తున్నాననంటూ సదరు నేత చెబుతూ శరవేగంగా షాపుల నిర్మాణాలను చేపట్టారు. ఇదంతా గ్రామకంఠ భూమి అని నిర్మాణాలకు విధిగా అనుమతులు ఉండాలని స్థానికంగా చర్చ సాగుతోంది. మరోవైపు 150 సర్వే నెంబరు మాత్రమే ప్రభుత్వానిదని, 149 కాదని మండల రెవెన్యూ సిబ్బంది చెబుతున్నారు. అదే క్రమంలో పేదలకు మాత్రమే పట్టాలివ్వాల్సిన గ్రామకంఠం, రస్తా స్థలాలను రాజకీయ నేత కబ్జా చేయడం సరైంది కాదంటూ జిల్లా జాయింట్ కలెక్టర్‌కు సైతం ఫిర్యాదులు వెళ్లాయి. వాణిజ్య అవసరాల కోసం ప్రభుత్వ స్థలాల సర్వే నెంబర్లను తారుమారు చేసి వినియోగించడం విశాఖలో రాజకీయ నాయకులకు కొత్తేమీ కాదు. ఈ నిర్మాణంలోనూ ఇలాంటి కోణం దాగి ఉందంటూ అధికార పార్టీకి చెందిన వారే పలువురు ఆరోపిస్తున్నారు.

అనుమతులెవరిచ్చారు ?

అధికార పార్టీ అయితే చాలు అడ్డగోలుగా నిర్మాణాలు సాగించేయవచ్చు అన్న సంకేతాలు ప్రస్తుత ప్రభుత్వ పెద్దలు ఆ పార్టీలోని దిగువ శ్రేణి నేతలకు అందిస్తున్నారనడానికి మిగతా 2లో..

ఫైన్ వేస్తాం.. కట్టుకుంటే సరిపోతుంది : ఎసిపి రఘునాథరావు

షాపుల నిర్మాణాలపై మధురవాడ ఇన్‌ఛార్జి ఎసిపి రఘునాథరావును 'ప్రజాశక్తి' వివరణ కోరగా 'షాపుల నిర్మాణాలకు ఎలాంటి ముందస్తు ప్లాన్ అనుమతులూ తీసుకోలేదు. పోలిరెడ్డి అనే అధికార పార్టీ నాయకుడు ఈ నిర్మాణం చేపడుతున్నాడని తెలిసింది. మేం నోటీసులు సిద్ధం చేస్తున్నాం. ఫైన్ వేస్తాం. కట్టుకుంటే సరిపోతుంది' అని బదులిచ్చారు.

కెజిహెచ్ పరిసర ప్రాంతాలను పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

కెజిహెచ్‌లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రతి రోజూ కెజిహెచ్‌కు చికిత్స కోసం వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున వైద్యాధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కెజిహెచ్‌ను ఆకస్మికంగా ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన గైనిక్ వార్డుకు వెళ్లి రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్యసదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం రోగులతో పాటు వచ్చే సహాయకులు విశ్రాంతి తీసుకునే గదులను పరిశీలించారు. వారికి అందుతున్న సదుపాయాలను కనుక్కున్నారు.

కెజిహెచ్‌లో చేపడుతున్న పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్ కుమార్, ఎపిఐడిసి ఇఇ నాయుడు, కెజిహెచ్ సిబ్బంది పాల్గొన్నారు.

23న సౌజన్య కూచిపూడి నాట్య ప్రదర్శన

వార్త 2లో..

దురంతో ఎక్స్‌ప్రెస్‌ను రోజూ నడపండి

వార్త 2లో..

ఉపాధ్యాయుల పిఎఫ్ సమస్యపై వినతి

వార్త 2లో..

ఎంపీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రూ.9 వేలు కనీస పెన్షన్ ఇవ్వండి

ఎంపీ నివాసం ఎదుట ఇపిఎస్ పెన్షనర్ల ఆందోళన వార్త మెయిన్‌లో..

జూనియర్ సివిల్ జడ్జిల బదిలీలు

ప్రజాశక్తి - లీగల్ రిపోర్టర్ : వార్షిక సాధారణ బదిలీల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ హైకోర్టు గురువారం ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా జరిగిన బదిలీలలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో పలువురు జూనియర్ సివిల్ జడ్జిలకు స్థాన చలనం జరిగింది. నగరంలోని ఆరో మెట్రోపాలిటీ మెజిస్ట్రేట్ కం రైల్వే కోర్టు జూనియర్ సివిల్ జడ్జి సిహెచ్.శ్రీనివాస్ బాబును జూనియర్ సివిల్ జడ్జిగా గన్నవరానికి బదిలీ చేశారు. ఇదే స్థానంలో జూనియర్ సివిల్ జడ్జిగా చిత్తూరులో విధులు నిర్వహిస్తున్న కె.అనురాగ్ అలియాస్ ఎంఎఎస్‌కె అనూష బదిలీపై వస్తున్నారు. విశాఖపట్నంలో ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వహిస్తున్న సాయి కృష్ణను కొవ్వూరు రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు బదిలీ చేశారు. ఈ స్థానంలో గన్నవరం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్న వి.గంగాభవాని బదిలీపై వస్తున్నారు. ప్రస్తుతం నర్సీపట్నం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న రెడ్డి ప్రసన్నను ఆరో అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా రాజమండ్రికి బదిలీ చేశారు ఇదే స్థానంలో జూనియర్ సివిల్ జడ్జి ఎస్.శ్రీనివాసరావు తూర్పు గోదావరి నుంచి బదిలీపై వస్తున్నారు. నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా అనకాపల్లిలో విధులు నిర్వహిస్తున్న పి.ప్రదీప్‌ను అనకాపల్లి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు అనకాపల్లిలో ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వహిస్తున్న ఎస్.విజయ్ చందర్ కొత్తవలస జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీ అయ్యారు. చోడవరం మిగతా 2లో..

ఉక్కును ప్రైవేటీకరిస్తే ఊరుకోం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రజల ఆకాంక్షను గుర్తించి విశాఖ స్టీల్‌ప్లాంట్‌తో సహా ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ ప్రైవేటీకరణ చేయకుండా బిజెపి ప్రభుత్వం ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఎన్నికల్లో తగిన గుణపాఠం తప్పదని ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు పడాల రమణ హెచ్చరించారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి చేపట్టిన రిలే దీక్షలు గురువారానికి 748వ రోజుకు చేరాయి. దీక్షల్లో ఎఐటియుసి నాయకులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండేళ్లకుపైగా కార్మికులు, ప్రజలు, అన్ని రాజకీయ పార్టీల, ప్రజా సంఘాల నేతలు స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను మిగతా 2లో..

ఉపాధ్యాయుల పిఎఫ్ సమస్యపై వినతి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : పిఎఫ్ సొమ్ము సకాలంలో క్రెడిట్ కాని కారణంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయని, ఆ సమస్యను తక్షణం పరిష్కరించాలని యుటిఎఫ్ అనకాపల్లి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వత్సవాయి శ్రీలక్ష్మి, గొంది చినబ్బాయ్ గురువారం సాయంత్రం ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ సిఇఒ శ్రీరామమూర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం వరకూ ఉద్యోగుల పిఎఫ్ నిధుల సమాచారం ఆన్‌లైన్ కాలేదని, 2010 నుంచి ఉద్యోగుల జీతాలు ఆన్‌లైన్‌లో ప్రభుత్వం చెల్లిస్తున్నప్పటికీ, ఇంకా ఆఫ్‌లైన్‌లోనే మిస్ క్రెడిట్లు షెడ్యూల్స్ తీసుకోవడం వల్ల సకాలంలో పిఎఫ్ సొమ్ము క్రెడిట్ కావడం లేదని అన్నారు. ఈ నేపథ్యంలో సమస్యకు ఆన్‌లైన్‌లోనే ఒక పరిష్కారం చూపాలన్నారు. మిస్ అయిన షెడ్యూల్స్ సమాచారం సంబంధిత అధికారులకు, ఆఫీసులకు సకాలంలో తెలియజేయాలని కోరారు. ఉమ్మడి జిల్లాలోని డిడిఒలతో మాట్లాడి పిఎఫ్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన జెడ్‌పి సిఇఒ హామీ ఇచ్చారు.

జెడ్‌పి సిఇఒకు వినతిపత్రం అందిస్తున్న యుటిఎఫ్ నాయకులు

మొదటి పేజీ తరువాయి..

రాజకీయ నాయకులా.. అయితే వదిలేస్తాం..!

ఇదే తార్మాణం. జివిఎంసిలో పలుకుబడితో ముందుకు సాగిపోతున్నారా ? అన్న అనుమానం ఇక్కడి నిర్మాణాన్ని చూస్తే కలుగుతోంది. ఒకవేళ నిర్మాణదారుడు చెబుతున్న ప్రకారం ఒకవేళ ఇది జిరాయితీ భూమే అయినా ప్రస్తుతం సాగుతున్న ఆరు షాపుల వాణిజ్య నిర్మాణాలకు జివిఎంసి పట్టణ ప్రణాళిక అనుమతులు ఉన్నాయా ? అంటే అలాంటివేమీ కనిపించడం లేదు.

ఉక్కును ప్రైవేటీకరిస్తే ఊరుకోం

వ్యతిరేకిస్తూ ఉద్యమం సాగిస్తున్నారని, దీనిని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇప్పటికైనా కళ్లు తెరిచి కేంద్రంపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎస్‌కె.రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ సివిల్ జడ్జిల బదిలీలు

ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వహిస్తున్న డి.ఉమాదేవి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా చిత్తూరుకు బదిలీ అయ్యారు. వారంతా తమ తమ స్థానాల్లో మే 3లోపు బాధ్యతలు చేపట్టాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మజ్జిగ పంపిణీ చేస్తున్న కలెక్టర్ మల్లికార్జున

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వేసవిలో ప్రజల దాహం తీర్చేందుకు రెడ్‌క్రాస్ సొసైటీ, విశాఖ డెయిరీ సంయుక్త ఆధ్వర్యంలో కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి స్వచ్ఛంద సంస్థలు, సేవా సంఘాలు ముందుకొచ్చి చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం ప్రజలకు చల్లని మజ్జిగను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్, డిఆర్‌ఒ శ్రీనివాసమూర్తి, ఆర్‌డిఒ హుస్సేన్ సాహెబ్, రెడ్‌క్రాస్ సొసైటీ మెంబెర్ ఎస్‌కెఎల్.రావు, విశాఖ డెయిరీ మార్కెటింగ్ మేనేజర్ హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

23న సౌజన్య కూచిపూడి నాట్య ప్రదర్శన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సినీ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ సతీమణి సౌజన్య శ్రీనివాస్ నాట్య ప్రదర్శన ఈ నెల 23న సుమారు వంద మంది సంగీత, సాహిత్య, నృత్య, గాత్ర తదితర అనుబంధ రంగాల నిపుణుల మేలుకలయికగా ప్రేక్షకుల ముందుకు రానుంది. బహుముఖ ప్రజ్ఞాశాలి, ప్రఖ్యాత కార్టూనిస్టు, బ్రెంగ ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన రచయిత భమిడిపల్లి నరసింహ మూర్తి కలం నుంచి జాలువారిన 267వ రచన మీనాక్షీ కల్యాణం కూచిపూడి నృత్యరూపక ప్రదర్శన ఆ రోజు సాయంత్రం వుడా చిల్డ్రన్స్ ఎరీనాలో జరుగనుంది. కేంద్ర ప్రభుత్వ సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీత పసుమర్తి రామలింగ శాస్త్రి నృత్య పరికల్పనలో రమారమి రెండున్నర గంటల నిడివిలో ఈ ప్రదర్శన ఉంటుంది. బాలాజీ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్, డాక్టర్ ఎలైట్ డయాగ్నోసిస్ సంస్థలు సహకారం అందిస్తున్నాయి. ప్రదర్శనకు ఆంధ్రవిశ్వకళాపరిషత్ పూర్వపు ఆచార్యులు, విశాఖ సాహితి అధ్యక్షురాలు కోలవెన్ను మలయవాసిని ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. గౌరవ అతిథులుగా శ్రీ కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంక్ ఛైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు, బాలాజీ విద్యా సంస్థల ఛైర్మన్ మండవ రవి కుమార్ విచ్చేయనున్నారు.

మత్స్యకారులకు ద్రోహం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం మత్స్యకారులకు తీరని ద్రోహం చేస్తోందని జనసేన మత్స్యకార విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ మూగి శ్రీనివాసరావు అన్నారు. గురువారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రూ.2 లక్షల కోట్ల బడ్జెట్‌లో ప్రభుత్వం మత్స్యకారుల కోసం కేవలం రూ.300 కోట్లు మాత్రమే కేటాయించడం దారుణమన్నారు. పత్రికల్లో ప్రకటనలు తప్ప చేసింది శూన్యమని మండిపడ్డారు. మత్స్యకారుల అభివృద్ధి కోసం తక్షణమే రూ.20 వేల కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

రాహుల్‌పై కుట్రపూరిత కేసులు

ప్రజాశక్తి - కలెక్టరేట్

కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కాంగ్రెస్ జాతీయ నేత, పార్లమెంట్ సభ్యుడు రాహుల్ గాంధీపై తప్పుడు కేసులు బనాయించి, ఎంపీగా అతన్ని అనర్హుడిని చేయడం దుర్మార్గమని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు గొంప గోవిందరాజు అన్నారు. రాహుల్ గాంధీపై పెట్టిన తప్పుడు కేసులను ఖండిస్తూ గురువారం కలెక్టరేట్ ఎదుట కాంగ్రెస్ నగర కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత పార్లమెంట్ చట్టసభల్లో అనేక మంది నేరస్తులు ఉండగా.. అవినీతిని ఎత్తిచూపే రాహుల్ గాంధీపై మాత్రమే కుట్రపూరిత కేసులు పెట్టి రెండేళ్ల జైలు శిక్ష విధించడం, పార్లమెంట్ హౌస్‌లో సస్పెన్షన్ వేటు వేయడం దారుణమన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాజ్యాంగ విరుద్ధ చర్యలకు పాల్పడుతోందని మండిపడ్డారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నగర కాంగ్రెస్ నాయకులు వజ్జిపర్తి శ్రీనివాసరావు, సోడదాసి సుధాకర్ పాల్గొన్నారు.

డిఆర్‌ఎంకు వినతిపత్రం అందిస్తున్న ఎంపీ

దురంతో ఎక్స్‌ప్రెస్‌ను రోజూ నడపండి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : తూర్పు కోస్తా రైల్వే డిఆర్ఎం అనూప్ సత్పతిని విశాఖ ఎంపీ ఎంవివి.సత్యనారాయణ గురువారం కలిశారు. విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలు, ప్రయాణికుల ఆకాంక్ష మేరకు విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్ వరకు ప్రయాణించే దురంతో ఎక్స్‌ప్రెస్ (22203) రైలును ప్రతిరోజూ నడపడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. డిఆర్ఎం సానుకూలంగా స్పందించారు.

కైలాష్ జైన్ మృతికి సంతాపం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : భారత నాస్తిక సమాజం సీనియర్ నాయకులు కైలాష్ బాబూ జైన్ మృతికి ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు టి.శ్రీరామమూర్తి, జిల్లా అధ్యక్షులు వై.నూకరాజు సంతాపం ప్రకటించారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఇఎంఐ చెల్లింపుల్లో ఒత్తిడి తగదు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రభుత్వ ఉద్యోగులు ప్రతి నెలా బ్యాంకులకు చెల్లించాల్సిన ఇఎంఐ చెల్లింపులపై బ్యాంకు అధికారులు ఒత్తిడి చేయొద్దని ఎపి అమరావతి జెఎసి విశాఖపట్నం ఛైర్మన్ సత్తి నాగేశ్వరరెడ్డి విజ్ఞప్తి చేశారు. గురువారం కలెక్టరేట్ ఆవరణలో ఉన్న ఎస్‌బిఐ మహారాణిపేట బ్రాంచ్ ఎదుట ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు ఇవ్వాల్సిన జీతాలను ప్రతి నెలా ఒకటో తేదీకి ఇవ్వడం లేదని, జీతాలు ఏ రోజు ప్రభుత్వం చెల్లిస్తుందో తెలియని పరిస్థితి ఉందని, ఈ నేపథ్యంలో ఉద్యోగులపై ఇఎంఐ చెల్లింపుల విషయమై ఒత్తిడి తేవొద్దని అన్నారు. పెనాల్టీలు వేయవద్దని కోరుతూ బ్యాంకు బ్రాంచి మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో జెఎసి జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు, జిల్లా రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్‌ఎ.త్రినాధరావు, క్లాస్ 4 ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు నమ్మి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రికార్డుల పరిశీలన

ప్రజాశక్తి - కలెక్టరేట్ : అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న సిబ్బంది, అనుసంధాన అధికారులంతా అంకిత భావంతో విధులు నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్‌పర్సన్ కేసలి అప్పారావు, సభ్యులు గొండు సీతారాం అన్నారు. గురువారం కెజిహెచ్ సమీపంలో ఉన్న జాలారిపేట అంగన్‌వాడీ కేంద్రాన్ని వారు ఆకస్మికంగా పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు.

విపత్తులను ఎదుర్కోవడంపై శిక్షణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం పోర్టు అథారిటీ, జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ సంయుక్తంగా విపత్తులను ఎదుర్కోవడంపై మూడు రోజులపాటు మాక్‌డ్రిల్ నిర్వహించాయి. పోర్టు ఛైర్మన్ టికె.రామచంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT BHEEMUNIPATNAM
I.A.131/2022 in O.S. 133/2022

Between:
Kampa Appala Reddy
. . . Petitioner / Plaintiff

And:
Madhula Veerabhadra Rao
. . . Respondent / Defendant

NOTICE

To:
Madhula Veerabhadra Rao
S/o. Satya Rao, Hindu,
aged about 54 years,
R/o. D.No.4-60-4/1,
Lawsons Bay Colony,
Visakhapatnam.

Please take notice that you are the respondent in the above IA filed along with the suit for temporary injunction restraining you from interfering with the possession and enjoyment of the suit schedule property by the petitioner/plaintiff until disposal of the suit and the same is stands posted to **11-05-2023** for your notice and appearance. So, you are hereby informed to appear before this Hon'ble court on **11-05-2023 at 10.30 AM** either in person or through an advocate failing which ex-parte order passed against you and also the matter will be decided ex parte.

(By order of the Hon'ble Court)
N.JANARDHANA RAO
Advocate, Bhemunipatnam.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT BHEEMUNIPATNAM
O.S. 133/2022

Between:
Kampa Appala Reddy
. . . Plaintiff

And:
Madhula Veerabhadra Rao
. . . Defendant

NOTICE

To:
Madhula Veerabhadra Rao
S/o. Satya Rao, Hindu,
aged about 54 years,
R/o. D.No.4-60-4/1,
Lawsons Bay Colony,
Visakhapatnam.

Please take notice that you are the defendant in the above suit filed for declaration of title to the plaint schedule property in favour of the plaintiff and the same is stands posted to **11-05-2023** for your notice and appearance. So, you are hereby informed to appear before this Hon'ble court on **11-05-2023 at 10.30 AM** either in person or through an advocate failing which ex-parte order passed against you and also the matter will be decided ex-parte.

(By order of the Hon'ble Court)
N.JANARDHANA RAO
Advocate, Bhemunipatnam

IN THE HONOURABLE COURT OF THE 1st ADDL JUNIOR CIVIL JUDGE AT SRIKAKULAM
IA 104/2022 in O.S. 166 /2022

Between: Ganta Upendra S/o Late Krishna Murthy, aged 35 years, residents of Gollapeta Village,Ponnam panchyat Srikakulam Rural Mandal & District.
-Petitioner/Plaintiff

And:
1.Ganta Ramesh, S/o Late Musalayya, aged 41 years, Residing at D. No 45-47- 39, Madati Garden, Akkayyapalem. Visakhapatnam
2.Ganta Narsabhai w/o Ramesh, aged 34 years, Residing at D. No 45-47-39 Madati Garden, Akkayyapalem. Visakhapatnam
-Respondents/Defendants

NOTICE

It is informed that the above matter **I.A.104/2022 in O.S.166/2022** on the file of **Honourable 1st addl junior civil judge court at srikakulam.** Is stands posted on **09-05-2023** for appearance and you are to appear on aforesaid date before the Honourable 1st addl junior civil judge court at srikakulam about at **10.30 AM,** in person or through pleader other wise the above matter will be decide against them.Hence this notice.

GONDU JANARDHANARAO
AMBATI VASUDEVARAO
Advocates for petitioner, srikakulam
Cell no. 9849196744.

ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు

కేకు కట్ చేస్తున్న ముక్కా ముత్యాలనాయుడు

తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు 73వ జన్మదిన వేడుకలు తెలుగు తమ్ముళ్లు సంబరంగా జరుపుకున్నారు. అన్నిచోట్లా కేక్‌లు కట్‌చేసి, మిఠాయిలను పంచారు. రక్తదాన శిబిరాల నిర్వహణ, పేదలకు దుస్తులు, రోగులకు పండ్లు రొట్టెలు పంపిణీ వంటి సేవా కార్యక్రమాలను నిర్వహించారు. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా రానున్న ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసేందుకు ఇప్పటినుంచే శ్రమించాలని టిడిపి కేడర్ నిర్ణయించారు. - ప్రజాశక్తి విలేకర్ల యంత్రాంగం

జగదీష్‌కు కేకు తినిపిస్తున్న టిడిపి నేతలు

సీతమ్మధార : చంద్రబాబు పుట్టినరోజు వేడుకల్లో భాగంగా 26వ వార్డు తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద రక్తదాన శిబిరం నిర్వహించారు. 50 మంది రక్తదానం చేసినట్లు టిడిపి వార్డు కార్పొరేటర్ ముక్కు శ్రావణి తెలిపారు, కార్యకర్తలు అభిమానులు సమక్షంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ముక్కా ముత్యాలనాయుడు, వార్డు అధ్యక్షులు ముక్కా కిషోర్‌కుమార్, వార్డు సెక్రటరీ పెద్దా లక్ష్మణ, ఉపాధ్యక్షులు కొత్తూరు శ్రీను పాల్గొన్నారు.

మధురవాడ : జివిఎంసి ఐదోవార్డు బొట్లవానిపాలెం పార్టీ కార్యాలయంలో భీమిలి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి రాజుబాబు, వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత ఆధ్వర్యంలో, అలాగే ఆరవవార్డు కాల నగర్ సాయి ఆలయంలో కార్పొరేటర్ పిళ్ళా మంగమ్మ, టిఎన్‌టియుసి నేత నాగోతి శివాజీ ఆధ్వర్యంలో చంద్రబాబు పుట్టినరోజు కేకును కట్ చేశారు. శివాజీ ఆధ్వర్యంలో వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మొల్లి లక్ష్మణరావు, వాండ్రశి అప్పలరాజు, నాగోతి సూర్యప్రకాష్, రాము, నమ్మి శ్రీను, జపాన్ పాల్గొన్నారు.

గోపాలపట్నం : చంద్రబాబు జన్మదినం పురస్కరించుకొని, పశ్చిమ ఎమ్మెల్యే పెతకంశెట్టి గణబాబు స్వగృహంలో జన్మదిన కేకు కట్ చేసి కార్యకర్తలకు పంచారు. టిడిపి నేతల ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు కార్పొరేటర్లు దాడి వెంకటరమేష్, బొమ్మిడి రమణ, నారిపిన్ని సత్తి రాజు, బొడ్డేటి విజయకుమార్, నరవ అనూష, ఎలమం చిలి ప్రసాదు, బంగారు తులసీరామ్ పాల్గొన్నారు.

పెందుర్తి : 94వ వార్డు టిడిపి ఆధ్వర్యంలో చంద్రబాబు పుట్టినరోజు సందర్భంగా మాజీ మంత్రి బండారు సత్యనారాయణ పాల్గొని కేక్ కట్ చేశారు. టిడిపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభిం చారు. వార్డ్ కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు

పద్మనాభం : స్థానిక టిడిపి కార్యాలయంలో చంద్రబాబు జన్మదిన కేకును పార్టీ అధ్యక్షుడు కె.రమణ, పూర్వ జెడ్‌పిటిసి ఎస్. దామోదరరావు, నందేశ్వరరావు కట్ చేసి, పార్టీ శ్రేణులకు పంచిపెట్టారు. రేవిడి పిహెచ్‌సి రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.

ఆనందపురం:చంద్రబాబు జన్మదినం సందర్భంగా ఆనందపురం కూడలిలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు ఆధ్వర్యంలో పిహెచ్‌సిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మీసాల సత్యనారాయణ, బొద్దపు శ్రీను, ఎర్ర బంగారునాయుడు (బన్నీ),దొంతల కనకరాజు, బంటుబిల్లి అప్పలస్వామి, పడాల అప్పలనాయుడు, లోడగల వెంకటరావు పాల్గొన్నారు. వేములవలస ఉప సర్పంచ్ కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్ ఆధ్వర్యంలో మధురవాడ అనాథాశ్రమంలో బాలబాలికల మధ్య చంద్రబాబు జన్మదిన కేకు కట్ చేశారు. బాలలకు కేకు, మిఠాయి పంచిపెట్టారు.

సీతమ్మధార : 14వ వార్డు టిడిపి అధ్యక్షులు మేకా సత్యకిరణ్ ఆధ్వర్యంలో అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద చంద్రబాబు జన్మదిన కేకు కట్ చేశారు.మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి లోడగల కృష్ణ, నేతలు టివి.వసంతరావు వార్డు ప్రధానకార్యదర్శి రాయుడు వెంకటరమణ, బి ప్రసాద్, హేమ, శ్రీలక్ష్మి, పులేశ్వరరావు పాల్గొన్నారు.

సింహాచలం: 98వ వార్డులో కార్పొరేటర్ పివి.నరసింహం, వార్డు అధ్యక్షుడు పంచదార శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణుల మధ్య చంద్రబాబుజన్మదిన కేక్ కట్ చేశారు తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి సతివాడ శంకరరావు, ధర్మారావు సిరిపురం సురేష్ పాల్గొన్నారు

ఆరిలోవ: 12వ వార్డు తోటగరువు టిడిపి కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు ఆధ్వర్యంలో చంద్రబాబు జన్మదిన కేకను కట్ చేశారు. పాదచారులకు, ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేసారు. టిడిపి నాయకులు ఒమ్మి అప్పలరాజు, గాడి సత్యం, భరత్, ఒమ్మి పోలారావు, ఏడువాక సన్యాసిరావు, కొత్తల గోపాల్, దువ్వి తాతారావు, నమ్మి గణేష్, బసవ దేవుళ్ళు పాల్గొన్నారు. 10వ వార్డు ఆదర్శనగర్ టిడిపి కార్యాలయంలో వార్డు ఇన్‌ఛార్జి మద్దిల రాజేశ్వర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శు భాకాంక్షలు తెలిపారు. వార్డు టిడిపి నేత అప్పలనాయుడు పాల్గొన్నారు.

భీమునిపట్నం : స్థానిక టిడిపి కార్యాలయంలో పార్టీ నియోజక వర్గ ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. కార్పొరేటర్లు గంటా అప్పలకొండ, ఎం.హేమలత, నేతలు డిఎన్ రాజు, పాసి నరసింగరావు, సరగడ అప్పారావు, కె దామోదరరావు, పిట్టా సురేష్ పాల్గొన్నారు

భీమిలిలో చంద్రబాబు జన్మదిన వేడుకల్లో రాజుబాబు

విశాఖ కలెక్టరేట్ : టిడిపి జిల్లా కార్యాలయంలో చంద్రబాబు జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని పార్టీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థిని దత్తత తీసుకోవాలని పార్టీ అధిష్టానం పిలుపునిచ్చిన నేపథ్యంలో పెదగంట్యాడకు చెందిన ఓ పేద కుటుంబాన్ని దత్తత తీసుకుంటున్నామని చెప్పారు. విశాఖ పార్లమెంట్ ఇన్‌ఛార్జి ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, పి.గణబాబు, దక్షిణ ఇన్‌ఛార్జి గండి బాబ్జీ, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, ఉత్తర నియోజకవర్గం ఇన్‌ఛార్జి చిక్కాల విజయ్ బాబు, రాజమండ్రి నారాయణ పాల్గొన్నారు.

అనకాపల్లి జిల్లాలో....

కశింకోట : స్థానిక ఎన్‌టిఆర్, బసవతారకం విగ్రహం వద్ద మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ కేక్ కట్ చేశారు. పేదలకు, వృద్ధులకు దుప్పట్లు, స్వీట్లు, మజ్జిగ, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నేతలు ఉగ్గిన రమణ మూర్తి, పెంటకోట రాము, వేగి గోపీకృష్ణ, సిద్ధిరెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సబ్బవరం : స్థానిక ఎన్టీఆర్ జంక్షన్‌లో మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. పిహెచ్‌సిలో తెలుగు యువత జిల్లా అధ్యక్షులు పిబివిఎస్ రాజు (బుచ్చిరాజు) ఆధ్వర్యాన రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. సబ్బవరం సర్పంచ్ డి. ప్రసాదరావు, టిడిపి నేతలు గండి రవి కుమార్, గండి ముత్యాల నాయుడు, బర్రికాన బాబురావు పాల్గొన్నారు.

అనకాపల్లి : టిడిపి జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలు ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు, ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, పట్టణ అధ్యక్షులు డాక్టర్ నారాయణరావు, మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ ఆధ్వర్యంలో గురువారం వేరువేరుగా నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో భారీ కేక్ కట్ చేశారు. ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రిలో గర్భిణులకు, నర్సింగ్, శానిటరీ, సెక్యూరిటీ సిబ్బందికి పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. పలుచోట్ల అన్న సమారాధనలు ఏర్పాటు చేశారు. చలివేంద్రాలు ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మళ్ల సురేంద్ర, బొలిశెట్టి శ్రీనివాసరావు, మాదంశెట్టి నీలబాబు, బొద్దపు ప్రసాద్, బొడ్డేడ జోగినాయుడు, ధనాల విష్ణు చౌదరి పాల్గొన్నారు.

పరవాడ : పరవాడలో మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి కేక్ కటింగ్ చేసి, స్వీట్స్ పంపిణీ చేశారు. మాజీ జెడ్పీటీసీ పైలా జగన్నాధరావు, మాజీ ఎంపిపి మాసవరపు అప్పలనాయుడు, పార్టీ నాయకులు పైల సన్యాసి రావు, అట్టా సన్యాసి అప్పారావు, వియ్యపు చిన్నా పాల్గొన్నారు.

అచ్యుతాపురం : స్థానిక టిడిపి కార్యాలయంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ప్రగడ నాగేశ్వరరావు, పూడిమడక లో మెరుగు బాబునాయుడు కేక్‌లు కట్ చేశారు. కొండకర్లలో మానసిక వికలాంగుల ఆశ్రమ పాఠశాలలో ప్రగడ జూనియర్ నాగేశ్వరరావు చేతుల మీదుగా పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. టిడిపి నాయకులు రాజాన రమేష్ కుమార్, జనపరెడ్డి నర్సింగరావు, రాజాన నానాజీ, మెరుగు బాపు నాయుడు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : చంద్రబాబు జన్మదిన వేడుకలు మండలంలోని పలు గ్రామాల్లో జరిగాయి. చిట్టిపాలెం, పెదపూడి, దిబ్బిడి, గ్రామాల్లో కేక్‌లు కట్ చేశారు.

పాయకరావుపేట: పాయకరావుపేటలో మండల టిడిపి అధ్యక్షుడు పెద్దిరెడ్డి చిట్టిబాబు ఆధ్వర్యంలో చంద్రబాబు నాయుడు జన్మదినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో కేక్ కటింగ్ చేశారు. అనంతరం పాయకరావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పాలు, పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాయకరావుపేట పట్టణ అధ్యక్షులు పెదిరెడ్డి శ్రీను, వల్లా విలియం కెర్రీ, పేదిరెడ్డి పండు, కంకిపాటి వెంకటేశ్వరరావు, బొందు కాశీ విశ్వనాధం, సూరిబాబు, లెక్కల గోవింద్, జురెడ్డి ప్రసాద్, గణపర్తి రాజబాబు, చుంచలపు పద్దు, కృష్ణా ప్రసాద్, సురేష్ రెడ్డి పాల్గొన్నారు

కె.కోటపాడు : మండలంలోని ఎ.కోడూరులో టిడిపి మాడుగుల నియోజకవర్గ నాయకులు పైలా ప్రసాదరావు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి వెయ్యి మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. వచ్చిన వారందరికీ భోజన ఏర్పాట్లు చేశారు. కూండ్రపువాని పాలెంలో కన్నూరు సూర్యనారాయణ పార్టీ కార్యకర్తలకు రీఫిల్ వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. టిడిపి నాయకులు రొంగలి మహేష్, బత్తి వెంకటరమణ, బండారు నరసింహనాయుడు, లెక్కల మల్లేశ్వరరావు రావాడ వెంకటరమణ పాల్గొన్నారు.

సీతమ్మధారలో సత్యకిరణ్ ఆధ్వర్యాన రక్తదాన శిబిరం

కె.కోటపాడులో పైలా ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

నేరాలు ఘోరాలు

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి -గాజువాక. : న్యూ పోర్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెంకన్నపాలెం సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గురువారం ఉదయం స్థానికులు గుర్తించారు. దీనిపై అందిన సమాచారం మేరకు స్థానిక పోలీసులు సంఘటనాస్థలాన్ని సందర్శించి వివరాలు నమోదు చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేశారు. కాగా గుర్తుతెలియని వ్యక్తి మరణానికి హత్య లేకుంటే ఆత్మహత్య కారణమా? లేకుంటే ఇంకేదైనా కారణాలున్నాయా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు

మావోయిస్టు నేత నాగభూషణ్‌కు బెయిల్

విశాఖ జైలు నుంచి విడుదలైన మావోయిస్టు నేత

ప్రజాశక్తి - ఆరిలోవ : మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యులు చద్దా నాగభూషణ్ గురువారం విశాఖ కేంద్ర కారాగారం నుంచి బెయిల్‌పై విడుదలయ్యారు. చద్దా నాగభూషణ్‌పై 59 కేసులున్నాయి. కొన్ని కేసుల్లో సరైన ఆధారాలు లేకపోవడంతో న్యాయస్థానం కొట్టేయగా, మిగిలిన 49 కేసులకు సంబంధించి 20 కేసుల్లో బెయిలు మంజూరు కావడంతో గురువారం జైలు నుంచి విడుదలయ్యారు. హుకుంపేట మండలానికి చెందిన చట్టా నాగభూషణ్ అలియాస్ మల్లన్న 9వ తరగతి చదువుతుండగానే మావోయిస్టు ఉద్యమంలోకి వెళ్లారు.

వివిధ కేసుల్లో ఒడిశా జైలులో ఆరేళ్ళు, విశాఖలో మూడేళ్ళు, రాజమండ్రి కేంద్రకారాగారంలో రెండేళ్ళు, తిరిగి విశాఖ కేంద్రకారాగారంలో మరో ఏడాది జైలు శిక్ష అనుభవించారు. విశాఖ కేంద్రకారాగారం నుంచి బెయిల్‌పై విడుదలైన చద్దా నాగభూషణ్ మాట్లాడుతూ 30 ఏళ్లుగా కుటుంబానికి దూరంగా ఉన్నానని, ఇపుడు వారిని కలుసుకోబోవడం ఆనందంగా ఉందన్నారు. బెయిల్‌కు సహకరించిన లాయర్లకు, అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. కోర్టు విధించిన షరతులకు కట్టుబడి ఉంటానన్నారు. బెయిల్ మంజూరుకు సహకరించిన వారికి చెడ్డపేరు తీసుకురానన్నారు.

నూతన పాలకవర్గం ఎన్నిక

ప్రజాశక్తి -కంచరపాలెం : 53వ వార్డు సాయినగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన పాలక మండలి ఎన్నిక గురువారం జరిగింది. అసోసియేషన్ అధ్యక్షుడుగా జి సాయిశంకర్ కుమార్, ఉపాధ్యక్షుడిగా వి శ్యామ్, కార్యదర్శిగా జి బాల, సహాయ కార్యదర్శిగా బి రాజేష్,కోశాధికారిగా ఎస్ గణేష్ ఎన్నికయ్యారు. ఎన్నికైన సభ్యులు బాధ్యతలు స్వీకరిస్తూ, సాయినగర్ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

ఆర్‌బికెల సేవలపై రైతులు పెదవి విరుపు

ప్రజాశక్తి-పద్మనాభం : రైతు భరోసా కేంద్రాల ఏర్పాటుతో అన్నదాతలకు కలిగే ప్రయోజనాలపై ప్రభుత్వం, అధికారుల ప్రకటనలకు, వాస్తవంగా జరుగుతున్న పరిస్థితులకు పొంతన లేదని పలువురు రైతులు ఆవేదన చెందుతున్నారు. ఆర్‌బికెల ద్వారా వ్యవసాయానికి ఉపయోగపడే అన్ని సౌకర్యాలను కల్పించడంతోపాటు రైతులు పండించే పంటలకు మద్దతుధరనిచ్చి కొనుగోలు చేస్తామని ప్రకటన నీటిమాటగానే ఉందని వాపోతున్నారు. చిరుధాన్యాలను కొనుగోలు చేస్తామని ప్రకటించినా, పద్మనాభం ప్రాంతంలో పండించిన రాగులు కొనుగోలు చేయడం లేదన్నారు. ఆర్‌బికె సేవలను మాటలు, కాగితాల్లో కాకుండా చేతల్లో చేసి రైతులకు అండగా నిలవాలని పలువురు కోరుతున్నారు. ప్రభుత్వం ఎంతో మహోన్నత ఆశయంతో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల సేవలను ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా పూర్తి స్థాయిలో సమర్థవంతంగా అందించేందుకు తగు చర్యలు చేపట్టాలని రైతన్నలు కోరుతున్నారు.

మే డే సాంస్కృతిక మేళాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ స్టీల్ ప్లాంట్ అమ్మకానికి వ్యతిరేకంగా ఈ నెల 30 నుంచి వచ్చేనెల 2 వరకు మూడురోజులపాటు ఉక్కునగరంలో నిర్వహించే మే డే సాంస్కృతిక మేళాను జయప్రదం చేయాలని 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి గంగారావు పిలుపునిచ్చారు. గురువారం ఉక్కునగరం సిఐటియు కార్యాలయం వద్ద స్టీల్ సిఐటియు, మహిళా సంఘం ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గంగారావు మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా సాంస్కృతిక ప్రదర్శనల ద్వారా ప్రజలను చైతన్యపరిచి, పోరాటానికి సమాయత్తం చేయడమే లక్ష్యంగా మేడే సందర్భంగా ఈ సాంస్కృతిక మేళాను నిర్వహిస్తున్నామని, ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్టీల్ సిఐటియు అధ్యక్షులు వైటి దాస్, స్టీల్ సిఐటియు నాయకులు పుల్లారావు, ఆర్ వెంకటరావు, కె బాలశౌరి, కె సత్యనారాయణ, చిరంజీవి మహిళా సంఘం నాయకురాలు కె వేణు పాల్గొన్నారు.

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న గంగారావు

పారిశుధ్య నిర్వహణ ఏర్పాట్లు పరిశీలన

సింహాచలంలో పర్యటించిన జివిఎంసి కమిషనర్

ప్రజాశక్తి-సింహాచలం: ఈ నెల 23న సింహాద్రి అప్పన్న చందనోత్సవం సందర్భంగా ఆలయం వద్ద చేపట్టే పారిశుధ్య నిర్వహణ ఏర్పాట్లను జివిఎంసి కమిషనర్ సిపి సాయికాంత్ వర్మ గురువారం పరిశీలించారు 98వ వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా అసంపూర్తి బిఆర్‌టిఎస్ పనులు, వార్డు అభివృద్ధిపై కమిషనర్‌ను వార్డు కార్పొరేటర్ పి.వి.నరసింహం కోరగా, సానుకూలంగా స్పందించారు. చందనోత్సవం రోజున భక్తులకు ఇబ్బంది కలగకుండా పారిశుధ్య పనులను చేపట్టాలని ఆదేశించారు. జెడ్‌సి మల్లునాయుడు, సిబ్బంది ఉన్నారు.

రెల్లి వీధిలో మెగా వైద్యశిబిరం

ప్రజాశక్తి- సీతమ్మధార : 25వ వార్డు రెల్లి వీధి దగ్గర కాస్మోలైఫ్ యూనివర్సల్ సంస్థ సౌజన్యంతోను వార్డు కార్పొరేటర్, జివిఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్ సారిపిల్లి గోవింద్ ఆధ్వర్యంలో మెగా వైద్యశిబిరం నిర్వహించారు. 14 రకాల వ్యాధినిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేశారు. ఈ సందర్భంగా గోవింద్ మాట్లాడుతూ, రెల్లివీధిలో పలువురు అనారోగ్యంతో బాధపడుతున్నట్లు సమాచారం తెలియడంతో ఈ వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.కార్యక్రమంలో న్యూట్రిషన్ కన్సల్టెంట్ హేమ, రత్న, స్థానిక నేతలు సారిపిల్లి గంగరాజు, గుడివాడ గౌరి నాయుడు, ఉప్పాడ సన్నీ, బొమ్మాలి రవి, జగన్, విజయ్, పద్మారావు పాల్గొన్నారు.

సామాజిక భవన నిర్మాణానికి శంకుస్థాపన

సిమెంట్ రోడ్డుకుశంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ కొండబాబు

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి నాలుగో వార్డు చేపలుప్పాడలో రూ.10లక్షలతో నిర్మించనున్న సామాజిక భవనానికి గురువారం వార్డు కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు శంకుస్థాపన చేశారు. అలానే రూ 3లక్షలతో నిర్మించనున్న సిమెంట్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

ఆకట్టుకున్న ఆంగ్ల భాషా ప్రదర్శన

ఆంగ్ల ప్రదర్శన తిలకిస్తున్న డైట్ ప్రిన్సిపల్

ప్రజాశక్తి -భీమునిపట్నం : ప్రభుత్వ డైట్‌లో గురువారం ప్రపంచ ఆంగ్ల భాషా దినోత్సవం సందర్భంగా ఆంగ్ల భాషా ప్రదర్శనను డైట్ ప్రిన్సిపాల్ యు.మాణిక్యం నాయుడు ప్రారంభించారు. ఆంగ్ల అధ్యాపకులు జిజిఎస్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో రెండు, నాల్గవ సెమిస్టర్ ఛాత్రోపాధ్యాయులు ప్రదర్శించిన ఆంగ్ల భాషా వివరాలు, వ్యాకరణ అంశాలు, భాషా క్రీడలు మొదలగు వాటిని తిలకించారు. 25న ఆంగ్ల భాషపై పలు రంగ స్థలం ప్రదర్శనలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కార్యాలయం సూపరింటెండెంట్ శిరీష, అధ్యాపకులు జె మాధవి, ఎం మహాలక్ష్మి, ఎస్ త్రినాథరావు, షేక్ అల్లాఉద్దీన్, జి రవి పాల్గొన్నారు.

గీతంలో ఆరిజోనా స్టేట్ వర్సిటీ బృందం

ఆరిజోనా వర్సిటీ బృందాన్ని సత్కరిస్తున్న గీతం ప్రతినిధులు

ప్రజాశక్తి- మధురవాడ : అమెరికాలోని ప్రసిద్ధ విశ్వవిద్యాలయం ఆరిజోనా స్టేట్ యూనివర్సిటీ అకడమిక్ నిపుణుల బృందం గురువారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాయాన్ని సందర్శించింది. ఆరిజోనా స్టేట్ యూనివర్సిటీ ప్రొఫెసర్ పాట్ ఫిలాన్, విద్యార్థి విభాగం డైరక్టర్ మైక్ మ్యాక్ బ్రైడ్, విభాగం సహాయ డైరక్టర్ అర్జుహన్ కెవాక్, డిజైన్, ఆర్ట్స్ విభాగం ప్రొఫెసర్లు డాక్టర్ సంగునెట్టి, డాక్టర్ సన్నిక్కో తదితరులు గీతంలోని విభాగాలను పరిశీలించారు. అనంతరం గీతం విసి ప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం, ప్రో వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ జయశంకర్ వారియర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ డైరక్టర్ ప్రొఫెసర్ మోహన్, అంతర్జాతీయ విద్యార్థి విభాగం డైరక్టర్ డాక్టర్ కె.పి.కిషన్, గీతం ఇంజనీరింగ్ విభాగం సీనియర్ ప్రొఫెసర్లు, డీన్‌తో సమావేశమై బోధన, పరిశోధన అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం మాట్లాడుతూ ప్రపంచశ్రేణి విద్యాలయంగా గీతంను తీర్చిదిద్దడానికి నిర్దేశించుకున్న లక్ష్యాలను వివరించారు. గీతంలో బోధన, పరిశోధనలు, కోర్సుల వివరాలను తెలిపారు. గీతం విద్యార్థుల ఉన్నతికి ఉపయోగపడే విద్యాసంస్థలతో మేథో సంబంధాలను నెలకొల్పడానికి ఆసక్తితో ఉన్నామని తెలిపారు.అనంతరం ఆరిజోనా స్టేట్ విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న కోర్సులు, పరిశోధన అవకాశాలను విద్యార్థులతో ముఖాముఖిలో వివరించిన ఆవర్సిటీ ప్రతినిధులు, విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు.

'స్వర సుధా ప్రవంతి' ఆవిర్భావం

ప్రజాశక్తి- సీతమ్మధార : ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న కోసూరి రాజు నేతృత్వంలో స్వరసుధా ప్రవంతి ఆర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అనే నూతన సంస్థ ఆవిర్భవించింది. గురువారం విశాఖ పౌర గ్రంథాలయంలో కళా రంగ ప్రముఖులు సన్ మూర్తి, ఫణిస్వామి, చెక్క రమాదేవి, భయ్యా శ్రీనివాస్ తదితరులు జ్యోతి ప్రజ్వలనతో సంస్థను ప్రారంభించారు. ఈ సందర్భంగా 'నాదమా రావే' పేరుతో సినీ సంగీత విభావరి నిర్వహించారు. మహ్మద్‌ఖాన్, ఎస్‌ఎస్‌ఎన్. రాజు, శృతిలయ ప్రభాకర్, ఎమ్మెస్ మాధవ్, ఎంటిఆర్ త్రినాధ్, లెఫ్ట్‌నెంట్ లోకేష్, వెంకటేష్ మాస్టర్, డాక్టర్ కె.ఎల్.రావు, బొమ్మిడి సత్యనారాయణ, హేమంత్ కుమార్, వి. రాంబాబు, వెంకటేష్, నాయుడు, శ్రీదేవి, లక్ష్మీ సాత్విక, గీత, మను పల్లా, కవిత, మాధురి, లయలి తదితర గాయనీ గాయకులు తెలుగు హిందీ గీతాలు ఆలపించి ప్రేక్షకులను అలరించారు.

విద్యార్థులకు చెప్పుల పంపిణీ

విద్యార్థులకు చెప్పులు అందజేస్తున్న ఎంపిపి రాంబాబు

ప్రజాశక్తి-పద్మనాభం : పద్మనాభం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం చెప్పులు పంపిణీ చేశారు. స్థానిక అనంత పద్మనాభస్వామి ఆలయ అర్చకులు తమ సొంత నిధులతో కొనుగోలు చేసిన చెప్పులను విద్యార్థులకు ఎంపిపి కె.రాంబాబు అందించారు.

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు

అగ్ని ప్రమాదాల నివారణ కు వినియోగించే పరికరాలు ప్రదర్శన

ప్రజాశక్తి -తగరపువలస : చిట్టివలస అగ్ని మాపకశాఖ ఆధ్వర్యంలో అగ్నిమాపక వారోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా హాజరైన విద్యార్థులకు, స్థానికులకు వారోత్సవాల ప్రాధాన్యతను, అగ్ని ప్రమాదాల నివారణకు వినియోగించే పరికరాలు, పనిముట్లను ప్రదర్శించి, వాటి పనితీరుపై ఫైర్ ఆఫీసర్ జి శ్రీనివాసరాజు అవగాహన కల్పించారు. హెడ్ కానిస్టేబుళ్లు జిఎస్‌కె రెడ్డి, టి వెంకటరావు, కె చక్రవర్తి, డ్రైవర్ ఆపరేటర్లు సిహెచ్‌విఆర్‌కె మూర్తి పాల్గొన్నారు

దీపేష్ దాతృత్వం

★ వైకల్యంలోనూ ఆపన్నులకు స్నేహ హస్తం

★ ఎందరికో ఆదర్శంగా వికలాంగ బాలుని సేవాభావం

హరీష్‌చంద్రకు ఆర్థికసాయం అందిస్తున్న దీపేష్

ప్రజాశక్తి- మాధవధార : ఇతరులకు సేవ చేయాలన్న తపన, కోరిక ఉండాలే గానీ, వయస్సు, వైకల్యం, ఇతరత్రా పరిస్థితులేవీ అడ్డంకి కాదని కాంగ్రెస్ ఒబిసి విభాగం రాష్ట్ర చైర్మన్ మూల వెంకటరావు కుమారుడు మూల దీపేష్ అనే బాలుడు నిరూపిస్తున్నాడు. తాను వైకల్యంతో బాధపడుతున్నప్పటికీ, అనారోగ్యంతో బాధపడుతున్న మరో బాలుడికి తన తండ్రితో కలిసి వారింటికి వెళ్లి, తాను దాచుకున్న డబ్బులు రూ.పది వేల నగదును బాధిత కుటుంబానికి అందించి తన దాతృత్వాన్ని చాటుకున్నాడు. ఎందరికో ఆత్మస్థైర్యాన్ని అందిస్తూ ఆదర్శవంతంగా నిలిచాడు. వివరాల్లోకి వెళితే..

నగరంలో ఓ ప్రైవేట్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కాంగ్రెస్ పార్టీ ఒబిసి విభాగం రాష్ట్ర చైర్మన్ మూల వెంకటరావు కుమారుడు దీపేష్ శారీరకంగా వైకల్యంతో బాధపడుతున్నా, మానసికంగా, సేవా, దానగుణం పరంగా ఎంతో దృఢత్వంతో ఉన్నాడని నిరూపిస్తున్నాడు. తెన్నేటి నగర్ ప్రాంతంలో అంపోలు హరీష్‌చంద్ర అనే విద్యార్థి దీర్ఘకాలిక ఆస్టియోయిడ్ ఆస్టియోమా ట్యూమర్ వ్యాధితో బాధపడుతున్న విషయం తెలుసుకొని తండ్రి మూల వెంకటరావుతో కలిసి, గురువారం బాధిత చిన్నారి ఇంటికి తానే నేరుగా వెళ్లి, హరీష్‌చంద్ర వైద్యఖర్చులకు తాను దాచుకున్న రూ.పదివేల నగదును దీపేష్ అందించాడు. సేవాభావానికి వైకల్యం, వయస్సుతో పనిలేదని నిరూపించాడు. కాగా, తమ బిడ్డ వైద్యానికి సాయం అందించిన దీపేష్‌ను హరీష్‌చంద్ర తల్లిదండ్రులు మాధవరావు, లక్ష్మి కృతజ్ఞతలు తెలిపి, ఆశీర్వదించారు.

దీపేష్ గతంలోనూ మాధవధారలో కేన్సర్‌పై అవగాహన ర్యాలీకి నేతృత్వం వహించారు. కరోనా సమయంలో దినసరి కూలీలకు అవసరమైన వస్తువులను పంపిణీ చేసి ఉదారతను చాటుకున్నారు. కోవిడ్ మందుల కొనుగోలుకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్‌కు ఏకంగా రూ.25వేల నగదు సాయాన్ని అందించారు. ఆపదలో ఉన్నవారికి తోటివారు అండగా నిలిచి ఆదుకోవాలని దీపేష్ కోరుతున్నారు. కాగా దీపేష్ సేవాభావాన్ని పలువురు అభినందించి, ప్రశంసలతో ముంచెత్తుతున్నారు. కార్యక్రమంలో మూల దీపేష్ తండ్రి మూల వెంకటరావు, స్థానికులు సీపాన రాము పాల్గొన్నారు.

ఇపిఎఫ్ పెన్షనర్ల భిక్షాటన

ఎంపీ సత్యవతికి వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి

దేశవ్యాప్తంగా 77 లక్షల మంది ఈపీఎస్ పెన్షనర్స్ తమ సమస్యల పరిష్కారం కోసం పార్లమెంటు సభ్యులకు వినతి పత్రాలు ఇచ్చి, స్టీలు పల్లాలు మోగించి నిరసన, భిక్షాటన కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా అనకాపల్లి పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ బివి సత్యవతికి ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ అనకాపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు. పెన్షన్ 9 వేల రూపాయలకు పెంచాలని, హయ్యర్ పెన్షన్ కోసం ఆప్షన్ అనుమతించాలని కోరారు. 35 లక్షల మందికి కేవలం 1000 రూపాయలు పింఛన్ మాత్రమే ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 30 సంవత్సరాలు పని చేసి రిటైర్ అయిన వారు ఎటువంటి ఆదరణ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వృద్ధాప్యంలో అనారోగ్యానికి మందులు కొనుక్కోలేని పరిస్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలపై పార్లమెంటు సమావేశాల్లో తెలియజేయాలని కోరారు. అనంతరం ఎంపీ కార్యాలయం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంతంలో భిక్షాటన చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కె దీనబంధు, తెలయ్య బాబు, విత్తనాల పోతురాజు, కె అప్పలరాజు, బలిరెడ్డి సత్యనారాయణ, కె పైడిరాజు నమ్మి అప్పలనాయుడు, పి గురునాథరావు, బి గురప్ప, కెపి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్ పల్లాలు మోగిస్తూ నిరసన తెలుపుతున్న పెన్షనర్స్

డ్రైనేజీ నిర్మాణానికి తవ్విన కాలువలో నిరసన తెలుపుతున్న దృశ్యం

ఓపెన్ డ్రైయినేజీ నిర్మాణం అడ్డగింత

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం, వడ్డాది దొరబాబు (ఈబీసీ) కాలనీలో బహిరంగ డ్రైనేజీని నిర్మించవద్దని కాలనీవాసులు కాలువ నిర్మాణాన్ని అడ్డుకున్నారు. స్థానిక కేజీబీవీ ద్వారా వచ్చే మురుగునీటి విడుదలకు కాలనీ మీదుగా కస్పా గ్రోయిన్ వరకు ఓపెన్ డ్రైనేజీ నిర్మిస్తున్నారు. దీనివలన తమకు అంటు వ్యాధులతో పాటు, తమ పిల్లలు కాలువలో పడి ప్రమాదాల బారిన పడే అవకాశం ఉన్నందున తక్షణమే నిలిపివేయాలని కాలువ గోతుల్లోకి దిగి నిరసన తెలిపారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించాలని డిమాండ్ చేశారు. ఉన్నతాధికారులకు వినతి పత్రాలు సమర్పించారు. అండర్ డ్రైనేజీ నిర్మించాలని, లేకుంటే కాలువపై మూతలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎం సుబ్బలక్ష్మి, కె శ్రీనివాసరావు, కె లక్ష్మి, ఎం నాగలక్ష్మి, బి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

సిఐ శ్రీనివాసరావుకు పుష్ప గుచ్ఛం అందిస్తున్న ముఠా కార్మికులు

ముఠా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన చలివేంద్రం

ప్రజాశక్తి-అనకాపల్లి : విశాఖ జిల్లా ముఠా వర్కర్స్ యూనియన్, నూకాంబిక గూడ్స్ ఆటో యూనియన్, దేవి తల్లి పాసింజర్స్ ఆటో యూనియన్ (సిఐటియు) సంయుక్త ఆధ్వర్యంలో గురువారం బైపాస్ జంక్షన్లో చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సిఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ పాదచారులు, ద్విచక్ర వాహనదారులు, ఆటో వర్కర్లకు ఈ చలివేంద్రం ఎంతో సేద తీరుస్తుందన్నారు. ఈ సందర్భంగా దాత టైల్స్ రాజును అభినందించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు మంద రాము, సూరిశెట్టి శ్రీను, ఎం.భవాని తదితరులు పాల్గొన్నారు.

సీతారాముల ఆలయ భూమిపై విచారణ

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని తాళ్లపాలెం శ్రీసీతారాముల ఆలయం భూమిపై జిల్లా దేవాదాయ శాఖ అధికారి ఎమ్.శ్రీధర్ గురువారం విచారణ చేశారు. తాళ్లపాలెం గ్రామానికి చెందిన కాపుగంటి వెంకటరమణ జమాదులపాలెం గ్రామ సర్వేనెంబర్ 653-1లోని 2.37 ఎకరాల భూమిని సీతారాముల ఆలయానికి ధూపదీప నైవేద్యాల గురించి గిఫ్ట్ రిజిస్ట్రేషన్ (డాక్యుమెంట్ నెంబర్ 2427/1974) చేసి ఇచ్చారు. గతంలో డాక్యుమెంట్స్ దొరక్క కసింకోట తహశీల్దారుకు ఫిర్యాదు చేశారు. అయితే ఈ భూమిలో జగనన్న ఇళ్లకు కేటాయిస్తున్న సమయంలో దీనిపై స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈ భూమిపై విచారణ జరపవలసిందిగా తహశీల్దారుకు వినతిపత్రం అందజేసింది. ఆయన ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో కలెక్టర్కు వినతిపత్రం అందజేశారు. కలెక్టర్ ఆదేశాలతో దేవదాయ శాఖ అధికారి గురువారం విచారణ గ్రామ పెద్దలు, యువతతో విచారణ చేశారు. జమదలపాలెం గ్రామంలోని రామాలయం భూమిని కూడా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు చిన్ని సన్యాసినాయుడు, చిన్ని వల్లభ నారాయణరావు, చిన్ని కోటేశ్వరరావు, ఆలయ ధర్మకర్త డాక్టర్ గల్లా రాజు, చిన్ని రాజీవ్, ముత్తా నాగేశ్వరరావు, కర్రి గోవింద, చిన్న జనార్దన్, శ్రీకాంత్ పంతులు, ఉల్లిగల్ రమేష, లక్కకు శంకర్రావు, అప్పారావు పాల్గొన్నారు.

దేవాదాయ శాఖ అధికారికి వినతిపత్రం ఇస్తున్న స్థానికులు

నిర్వాసిత నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలి

మంత్రి అమర్‌నాథ్ దృష్టికి రుషిల్ డెకార్ కార్మికుల సమస్య

మంత్రి అమర్‌నాథ్‌ను కలిసిన నిర్వాసితులు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

ఎస్ఇజెడ్‌కు భూములు ఇచ్చి ఉపాధి కోల్పోయిన నిర్వాసితులందరికీ శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించాలని నిర్వాసిత ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్నాథ్ కలిశారు. ఈ సందర్భంగా రుషిల్ డెక్కర్ ప్రైవుడ్ పరిశ్రమలో ఉపాధి కోల్పోయిన నిర్వాసితుల సమస్యను మంత్రికి దృష్టికి తీసుకువెళ్లారు. రుషిల్ డెకార్ ఫ్లే వుడ్ పరిశ్రమలో నిర్వాసితులు, ముఠా కార్మికులకు పాత పద్ధతులో పనులు కల్పించి న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా సిఐటియూ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ రాము మాట్లాడుతూ ఎస్ఇజెడ్ పరిశ్రమలకు అతి తక్కువ ధరకు భూములు ఇచ్చిన నిర్వాసితులకు పరిశ్రమల్లో ఉపాధి కల్పించాల్సిన బాధ్యత పరిశ్రమ యజమానులపై ఉందని తెలిపారు. పరిశ్రమలలో ఉపాధి కల్పించకపోతే భూములు కోల్పోయిన నిర్వాసితుల ఏం తిని బతకాలని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ద్వారపురెడ్డి బాబ్జి, కొరుప్రోలు చిన్నారావు, సత్యం, ముఠా కార్మికులు నానాజీ సత్తిబాబు సూరిబాబు అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు

కలియుగ భగవాన్ సినిమా పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -మునగపాక రూరల్

విభిన్న కథా చిత్రాలకు ప్రేక్షకులలో అపూర్వ ఆదరణ నేటికీ లభిస్తుందని ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు తన క్యాంప్ కార్యాలయంలో ఈనెల 21వ తేదీన విడుదల కానున్న కలియుగ భగవాన్ సినిమా పోస్టరును గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ టీవీలు, సెల్ ఫోన్ మోజుల్లో పడి సినిమా పరిశ్రమకు ఆదరణ కరువు అవుతున్న రోజుల్లో సంప్రదాయ విలువలకు అద్దం పట్టే చిత్రాలకు మంచి ఆదరణ లభించడం గొప్ప శుభ పరిణామని చెప్పారు. గాయకుడిగా, గేయ రచయితగా, లఘు చిత్రాలతో తన ప్రస్థానం ప్రారంభించి వెండి తెర దర్శకుడుగా తన ప్రజ్ఞ పాటవాలు చూపిన గ్రామస్తుడు, కలియుగ భగవాన్ చిత్ర దర్శకుడు కొరుకొండ గోపికృష్ణను ప్రసాద అభినందించారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన వెలవలపల్లి కోటేశ్వర శర్మ (చిత్రంలో ప్రత్యేక పాత్రధారి), విల్లూరి జగ్గ అప్పారావు (మాటల రచయిత), చిత్ర నిర్మాత మేడిది ఈశ్వరరావు, వెలగ సురేష్ కుమార్, దాడి పోలీస్, వేగి కృష్ణ, ఆడారి గోపి, రాజాన బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బొడ్డేడ ప్రసాద్ తదితరులు

నేటి నుంచి 24 వరకు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-కశింకోట

మండలంలోని తాళ్లపాలెం, కన్నూరుపాలెం, నరశింగబిల్లి సబ్ స్టేషన్ పరిధిలో ఈ నెల 21 నుండి 24 వరకు ఉదయం 6.30 నుండి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపిఈపిడిసిఎల్ సెక్షన్ ఏఇ బిఎల్‌వి నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రోజుల్లో విద్యుత్ లైన్లపై చెట్లు కొమ్మలు తొలగింపు కార్యక్రమం చేస్తున్నామని, ఇందుకు సంబంధించి నరశింగబిల్లి, సోమవరం, గొబ్బూరు, ఏనుగు తుని, చిన ఏనుగు తుని, ఎన్‌జి పాలెం, పరవాడ పాలెం, ఉగ్గిని పాలెం, జమాదులపాలెం, తీడ, జీ భీమవరం, అచ్చర్ల కన్నూరుపాలెం, అడ్డాం, మాసయ్యపేట, గొకివానిపాలెం గ్రామాల్లో విద్యుత్ కోత ఉంటుందని, ప్రజలు సహకరించాలని కోరారు.

23న గురుకులాల ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి - కశింకోట : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల/ కళాశాలల్లో ఐదవ తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి ఈ నెల 23న ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు మండలంలోని తాళ్లపాలెం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ మళ్ళ మాణిక్యం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఐదో తరగతి వారికి, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇంటర్మీడియట్ వారికి ఈ పరీక్ష జరుగుతుందని వెల్లడించారు. పరీక్షకు హాజరు కాబోయే విద్యార్థులు ముందుగా www.apgpcet.apcfss.in వెబ్ సైట్ నుండి హాల్ టికెట్‌ను డౌన్లోడ్ చేసుకొని హాల్ టికెట్‌తో పాటుగా ఒరిజినల్ ఆధార్ కార్డును తమ వెంట తీసుకుని రావాలని సూచించారు. ఎవరికైనా హాల్ టికెట్లో ఫోటో ప్రింట్ కాకుంటే పాస్‌పోర్టు సైజ్ ఫోటోను తీసుకురావాలని, విద్యార్థులందరూ సమయానికి హాజరుకావాలని సూచించారు.

ప్రభుత్వాసుపత్రిలో నూతన పరికరాలు ప్రారంభం

ప్రజాశక్తి-యలమంచిలి రూరల్ : ఎలమంచిలి ప్రభుత్వ ఆసుపత్రిలో నూతన పరికరాలను గురువారం ఎమ్మెల్యే యువి. రమణమూర్తిరాజు ప్రారంభించారు. ఆసుపత్రిలో ఆధునిక పరికరాలు లేక రోగుల ఇబ్బందులను గమనించిన ఎమ్మెల్యే తోయోత్సు రేర్ ఎర్త్ లిమిటెడ్ కంపెనీని కోరి వెంటనే సిఎస్ఆర్ నిధులతో అల్ట్రా సౌండ్ స్కానింగ్ మిషన్, ఆటోమేటిక్ పరికరాలను 16 లక్షలతో కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా కన్నబాబురాజు మాట్లాడుతూ ఎలమంచిలి మండల పరిధిలో జాతీయ రహదారి సుమారు 20 కిలోమీటర్లు మేరా ఉండటం వలన ఏ ప్రమాదం జరిగిన స్థానిక ప్రభుత్వాసుపత్రికి వచ్చిన రోగులకు ఆర్థోపెడిక్ పరికరాలు లేక అనకాపల్లి, విశాఖపట్నం కు రిఫర్ చేయాల్సి వచ్చేదని తెలిపారు. ఈ క్రమంలో మార్గమధ్యలో ప్రాణాలు కూడా పోగొట్టుకోవాల్సి వస్తుందని, రోగుల ఇబ్బందుల దృష్టిలో పెట్టుకొని ఈ పరికరాలు ఏర్పాటు చేసేందుకు కంపెనీ వారి సహకారం కోరడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డిసిసిబి చైర్మన్ సుకుమార్ వర్మ, మున్సిపల్ చైర్ పర్సన్ రమాకుమారి, మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణి, వైసీపీ నాయకులు బెజవాడ నాగేశ్వరరావు, ఆరెపు గుప్త, బొద్దపు ఎర్రయ్య దొర, డాక్టర్ సురేఖ, జయకర్, నిహారిక లు పాల్గొన్నారు.

పరికరాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి రాజు

క్షతగాత్రునికి న్యాయం చేయాలని ఆందోళన

- దిగివచ్చిన యాజమాన్యం
- 2.75 లక్షలు పరిహారం ఇచ్చేందుకు అంగీకారం

ప్రజాశక్తి-అచ్యుతాపురం

లారీ ఢీ కొన్న ప్రమాదంలో కాలు నుజ్జు అయిన క్షతగాత్రుడు పప్పల అప్పలరాజుకు న్యాయం చేయాలని కోరుతూ మండలంలోని మడుతూరు గ్రామస్తులు గురువారం గ్రామంలోని పెట్రోల్ బంక్ సమీపంలో ఆందోళన చేశారు. దీంతో దిగొచ్చిన యాజమాన్యం పరిహారం చెల్లించడానికి అంగీకరించింది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... ఈనెల 13న మడుతూరు గ్రామానికి చెందిన పప్పల అప్పలరాజు ఆర్ఎస్ఎల్ కంపెనీలో పనిచేసి తిరిగి వస్తుండగా అచ్యుతాపురం జంక్షన్‌లో బొగ్గు రవాణా చేసే లారీ ఆయన్ను ఢీకొంది. ఈ ప్రమాదంలో అప్పలరాజు కాలు నుజ్జునుజ్జు అయింది. వైద్య చికిత్సలు నిమిత్తం అప్పలరాజును విశాఖ కిమ్స్ ఐకాన్ హాస్పిటల్‌లో చేర్చారు. వైద్య చికిత్సలకు సుమారు మూడు లక్షల రూపాయలు వెచ్చించారు. నిరుపేద కావడంతో అప్పులు చేసి వైద్యం చేయించారు. ప్రమాదానికి కారణమైన లారీ యాజమాన్యాన్ని సంప్రదించి అప్పలరాజుకు వైద్య చికిత్స నిమిత్తం ఆర్థిక సహాయం చేయాలని ప్రాధేయపడ్డారు. గ్రామస్తులు అడిగినా, పెద్దలతో సంప్రదించిన యాజమాన్యం పట్టించుకోలేదు. ఎలాగైనా అప్పలరాజు కుటుంబానికి న్యాయం చేయాలని మడుతూరు గ్రామస్తులందరూ ఐక్యంగా కదిలి వచ్చారు. గురువారం మడుతూరు జంక్షన్‌లో పెట్రోల్ బంకు సమీపంలో ప్రమాదానికి కారణమైన కంపెనీకి చెందిన లారీలను నిలిపివేశారు. దీంతో పరవాడ డిఎస్పి శ్రీనివాసరావు, అచ్యుతాపురం పరవాడ సిఐలు, ఎస్ఐలు అందరూ అక్కడికి చేరుకున్నారు. ఆందోళన చేస్తున్న గ్రామస్తులను చెదరగొట్టారు. అయినా గ్రామస్తులు అక్కడే బైఠాయించారు. ఎమ్మెల్యే దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. దీంతో స్థానిక నాయకులతో కలిసి యాజమాన్యం చర్చలు జరిపారు. చివరకు క్షతగాత్రుడుకు వైద్య చికిత్స నిమిత్తం రూ.2.75 లక్షలు పరిహారం ఇవ్వడానికి యాజమాన్యం అంగీకరించినట్లు గ్రామస్తులు తెలిపారు.

ఉచిత గుండె వైద్య శిబిరం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని తిమ్మరాజుపేట గ్రామంలో గురువారం అను న్యూరో కార్డియాక్ సైన్సెస్ ఆధ్వర్యంలో ఉచిత మెగా గుండె వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పెరగడం భాగ్యలక్ష్మి బాపినాయుడు నేతృత్వంలో జరిగిన శిబిరానికి వచ్చిన రోగులకు ఈసీజీ, టిఎంటి, ఈకో తదితర వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ బిశెట్టి రాము, ఉత్సవ కమిటీ చైర్మన్ భవిరిశెట్టి రవికుమార్, వైద్య నిపుణులు, గ్రామస్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

వాడ్రాపల్లిలో 'మా నమ్మకం నువ్వే జగన్'

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : మండలంలోని వాడ్రాపల్లి గ్రామంలో గురువారం మా నమ్మకం నువ్వే జగన్ ముగింపు సభ జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు మాట్లాడుతూ 14 రోజుల పాటు గ్రామంలో గడపగడపకు తిరగడం జరిగిందని చెప్పారు. పార్టీలకతీతంగా ప్రతి ఇంటికి వెళ్లి జగనన్న సంక్షేమ పథకాల అమలు తీరును తెలుసుకున్నట్లు తెలిపారు. వైసిపి ప్రభుత్వ సంక్షేమ పథకాల పట్ల ప్రజల సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో పెతకంశెట్టి రామ జోగి నాయుడు, చీర రమణమ్మ, మల్ల జోగినాయుడు, మల్ల కనుమ నాయుడు, పెతకంశెట్టి భాస్కరరావు, పెతకంశెట్టి శివాజీ, సచివాలయ సిబ్బంది, గృహ సారథులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

రూ.35 లక్షలతో పాండవుల చెరువు అభివృద్ధి

ప్రజాశక్తి -వడ్డాది : అమృత సరోవరంలో భాగంగా బుచ్చయ్యపేట మండలం, వడ్డాదిలోని 45 ఎకరాల పాండవుల చెరువును ఉపాధి హామీ చట్టం కింద రూ.35 లక్షలతో అభివృద్ధి చేస్తున్నట్లు జడ్పీటీసీ దొండా రాంబాబు తెలిపారు. గురువారం ఆయన ప్రత్యేక పూజలు చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీలో వున్న సుమారు 600 మంది కూలీలకు 6 నెలలు పాటు ఉపాధి కల్పించాలని ఉద్దేశంతో ఈ భారీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు. పాండవుల చెరువును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు చెరువు చుట్టూ పక్షుల మొక్కలు నాటించి పార్క్‌గా తీర్చిదిద్దుతానని తెలిపారు. చెరువు ఆక్రమణలు ఉంటే వాటిని గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ ఆనంద్, ఎంపీటీసీలు కోరుకొండ రమణ, ఇంటి అప్పారావు, విఆర్పి మంచాల గోవింద, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ చింతల శంకర్రావు, వార్డ్ మెంబెర్ అయ్యన్నదొర తదితరులు పాల్గొన్నారు.

భారీ అన్న సమారాధన

ప్రజాశక్తి-అనకాపల్లి : శ్రీ నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య నెల పండుగ జాతరను పురస్కరించుకొని గురువారం భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణ కుంకుమ పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ తాకాసి చిన్న, కార్పొరేటర్ జాజుల ప్రసన్న లక్ష్మి, ఆలయ చైర్మన్ తాకాశి రాజేష్ అన్న సమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తాకాశి సూర్యారావు, తాకాశి కొండలరావు బేతి ఈశ్వరరావు, కృష్ణ నాగేష్ విష్ణు, సత్యం దొర, గంగుపాం మహేష్ దొర, కారుకుండి కన్నా, తాకాశి వీధి యూత్ సభ్యులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని పెద గొల్లలపాలెం పంచాయతీలో శాంతి భద్రతల కమిటీ ఏర్పాటు చేసినట్లు స్థానిక సిఐ పి.రంగనాథం తెలిపారు. గురువారం గ్రామస్తులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల గ్రామంలో ఇరువర్గాల మధ్య ఘర్షణలు, కొట్లాటలు జరగడంతో ఈ శాంతి భద్రతల కమిటీ ఏర్పాటు చేశామన్నారు. గ్రామంలో స్నేహపూర్వక వాతావరణం నెలకొల్పడానికి ఈ కమిటీ తోడ్పడుతుందని చెప్పారు. గ్రామంలో ఏ సమస్యలు వచ్చినా గ్రామ శాంతి భద్రతల కమిటీ పరిష్కరించే దిశగా పనిచేస్తుందన్నారు. ఏ సమస్యలు ఉన్నా గ్రామ దత్తత కానిస్టేబుల్, సచివాలయం దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై అల్లు వెంకటేశ్వరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పెద గొల్లలపాలెం గ్రామస్తులతో మాట్లాడుతున్న సిఐ రంగనాథం

ఆర్‌సి ప్లాట్లు ఇచ్చే వరకు భూముల్లోకి రానివ్వం

బోరు ఏర్పాటును అడ్డుకున్న ల్యాండ్ పూలింగ్ బాధితులు

ప్రజాశక్తి -అనకాపల్లి

మండలంలోని మామిడిపాలెం గ్రామంలో వీఎంఆర్‌డిఎ ల్యాండ్ పూలింగ్‌లో భూములు కోల్పోయిన రైతులకు రెసిడెన్షియల్ ప్లాట్లు ఇచ్చేవరకు ఆ భూముల్లో ప్రభుత్వం ఎటువంటి పనులు చేపట్ట రాదని బాధిత రైతులు స్పష్టం చేశారు. గురువారం ల్యాండ్ పూలింగ్ జరిగిన చోట బోరు ఏర్పాటుకు అధికారులు వస్తే వారిని బాధిత రైతులు అడ్డుకున్నారు. బోరు తవ్వకం పనులను అడ్డగించి నినాదాలు చేశారు. నాలుగేళ్ల కిందట భూ సమీకరణలో భూములు కోల్పోయిన రైతులకు నేటికీ న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఒప్పందం ప్రకారం ఇవ్వాల్సిన రెసిడెన్షియల్ ప్లాట్లు ఇవ్వలేదని, తమకు న్యాయం జరిగేంత వరకు పనులు జరగనివ్వ బోమని ఏపీ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో దళిత గిరిజన రైతు కూలి ప్రజలు అడ్డగించారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి కోన మోహన్ రావు, సభ్యులు వి నరసింగ రావు, బత్తిన కృష్ణ, కే కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.

బోరు ఏర్పాటును అడ్డుకున్న ల్యాండ్ పూలింగ్ బాధితులు

టార్పాలిన్‌లు అందజేస్తున్న సర్పంచ్ గంగ అప్పలనాయుడు

రైతులకు టార్పాలిన్ల పంపిణీ

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : మండలంలోని మూలపేట గ్రామంలో స్థానిక పాల కేంద్రం వద్ద నూర్పుడు టార్పాలిన్‌లు సర్పంచ్ భీశెట్టి గంగ అప్పల నాయుడు గురువారం రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి కూడా పెద్ద పీట వేసిందన్నారు. రూ.2500 విలువగల నూర్పు పరదాలు సబ్సిడీ మీద రూ.1500కు రైతులకు అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్ భవాని, కాండ్రేగుల ఆదినారాయణ, కాండ్రేగుల ఈశ్వర అప్పారావు, బీసెట్టి పైడికొండ, ఆడారి తాతి నాయుడు, మొల్లేటి రాజు, బొడ్డేడ ఆదిరాజు, రైతులు పాల్గొన్నారు.

కర్రి నరసింహారావుకు ఘన నివాళి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : సిపిఎం నాయకులు కీర్తిశేషులు కర్రి నరసింహారావు వర్ధంతి కార్యక్రమం తిమ్మరాజుపేట గ్రామంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి కుమారులు కర్రి సుందరయ్య, స్వామిబాబు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామానికి చెందిన పలువురు జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా అతను చేసిన కార్యక్రమాలను గుర్తు చేసుకున్నారు.

ఇఎంఐ లావాదేవీల చెల్లింపుపై సడలింపు ఇవ్వాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఉద్యోగుల ఈఎంఐ లావాదేవీల చెల్లింపులపై సడలింపు ఇవ్వాలని ఏపీ జేఏసీ అమరావతి నాయకులు విజ్ఞప్తి చేశారు. జెఎసి రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా గురువారం అనకాపల్లి శాఖ ఆధ్వర్యంలో బ్యాంకులను సందర్శించి వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా అనకాపల్లి జిల్లా శాఖ చైర్మన్ సింగంపల్లి వాసు, ఏపీఆర్ఎస్ఏ సెక్రటరీ వై శ్రీరామ్మూర్తి, ఉపాధ్యక్షురాలు జయశ్రీ, ఏపీ కార్మిక శాఖ మినిస్టీరియల్ స్టాఫ్ రాష్ట్ర అధ్యక్షులు కోరుకొండ ప్రభాకర్ రావు అనకాపల్లిలో పలు బ్యాంకుల మేనేజర్లను కలిసి ఉద్యోగుల జీతాలు పించన్లు సకాలంలో బ్యాంకు ఖాతాల్లో పడకపోవడాన్ని వారి దృష్టికి తీసుకెళ్లారు.

వైఎస్ఆర్ బీమా చెక్కు పంపిణీ

ప్రజాశక్తి - కశింకోట : కశింకోట గ్రామానికి చెందిన పూడి ఆనంద్ ఇటీవల మృతి చెందగా, వైఎస్ఆర్ బీమా కింద రూ.10వేలు చెక్ మృతుని భార్య పూడి కళావతికి గురువారం పంచాయతీ కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మంత్రి జయరజని మాట్లాడుతూ ప్రభుత్వం పథకాలు పేదలకు ఆసరాగా ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి నల్లం రమేష్ కుమార్, పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేస్తున్న సర్పంచ్ జయరజని తదితరులు

ప్రజలకు మరింత చేరువుగా ప్రభుత్వం

రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రజలకు మరింత చేరువుగా ప్రభుత్వ సేవలను, సంక్షేమ పథకాలను అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ పేర్కొన్నారు. జీవీఎంసీ విలీన గ్రామాలు ఎరుకువానిపాలెం, రాజుపాలెం గ్రామాల్లో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని మంత్రి అమర్నాథ్ భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఇరుకువానిపాలెంలో రూ.19.50 లక్షలతో నిర్మించనున్న డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గొర్లె సూరిబాబు, కార్పొరేటర్ కొణతాల నీలిమ భాస్కరరావు, ఆయా గ్రామాల వైసిపి నాయకులు, కన్వీనర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొండవాలు ప్రాంతాల్లో గడపగడపకూ...

కంచరపాలెం : 47వ వార్డు అంబేద్కర్ ఎస్టేట్, సురేష్ రామ్‌నగర్ సచివాలయ పరిధిలోని కొండవాలు ప్రాంతాల్లో వార్డు కార్పొరేటర్ కంటిపాము కామేశ్వరి ఆధ్వర్యంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ రాష్ట్ర చైర్మన్ కె.కె రాజు పర్యటించారు. ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వ సంక్షేమ ఫలాలను వివరిస్తూ, ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిరణ్‌రాజు, డైరెక్టర్లు రాయుడు శ్రీను, వసంతల అప్పారావు, సుకుమార్, విజయ్, ముక్క రమణ, సురేష్, గురువోజీ, రాఘవులు, కనకరాజు, సాయి, చందురెడ్డి, రమేష్, శంకర్, వాసు, నర్సింగ్, జయకుమార్, అజయ్, కె.చిన్న, ధనరాజ్, పావని పాల్గొన్నారు.

ప్రజలతో మాట్లాడుతున్న కెకె.రాజు

వేసవిలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి- అనకాపల్లి

వేసవిలో వడదెబ్బకు గురికాకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలని ఎన్టీఆర్ ఆసుపత్రి ఆయుర్వేద వైద్యులు కే లావణ్య సూచించారు. ఆయుష్ గ్రామ శిబిరంలో భాగంగా గురువారం భీముని గుమ్మం అంగన్వాడీ కేంద్రంలో వడదెబ్బ తగలకుండా తీసుకోవలసిన ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సబ్జా, బార్లీ వినియోగం, ఖర్జూరం, ద్రాక్ష, మజ్జిగ, సుగంధి వంటి పానీయాలు తీసుకోవడం ద్వారా ఎండ వేడిమి నుంచి రక్షించుకోవచ్చని తెలిపారు. వేసవికాలంలో మసాలా ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు ఎండలోకి వెళ్లకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ద్రవహారాన్ని ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీబీహెచ్వీ లక్ష్మి, అంగన్వాడి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు ప్రోత్సాహకాలు

ప్రభుత్వ విప్, చోడవరం శాసనసభ్యులు ధర్మశ్రీ

ప్రజాశక్తి -రావికమతం: దివ్యాంగ విద్యార్థులను సకలాంగులతో సమానంగా చూసుకోవలసిన బాధ్యత మనందరి పై ఉందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, చోడవరం శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ కోరారు. ఈ సందర్భంగా మండలంలో కవగుంట గ్రామానికి చెందిన ఇద్దరు దివ్యాంగ విద్యార్థులకు ప్రత్యేక అవసరాల పరికరాలను ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, సర్పంచ్ దాసరి సూర్యకుమారి, వరహాలు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ, దివ్యాంగులను మనందరి మధ్యలో మనందరితో సమాన స్థాయిలో కలుపుకొని వారిని సకలాంగులుగా భావించి చూసుకోవడం మన బాధ్యత అని తెలిపారు.ప్రభుత్వం దివ్యాంగ విద్యార్థులకు అవసరమైన ప్రత్యేక పరికరాలను, ప్రోత్సాహకాలు అందిస్తుందన్నారు. వాటిని గ్రామాలలో ఉన్న ప్రజాప్రతినిధులు అటువంటి వారిని గుర్తించి వారిని అవసరమైన వాటిని అందించాలన్నారు.

సర్పంచ్ మాట్లాడుతూ, చోడవరం శాసనసభ్యులు ధర్మ శ్రీ సహకారంతో కవగుంట గ్రామానికి చెందిన దివ్యాంగ విద్యార్థులు అడ్డూరి పవన్ కుమార్‌కు రూ. 15 వేల విలువగల వినికిడి యంత్రం, సమాల తరుణ్ కుమార్ కు వీల్ చైర్ అందించడం జరిగిందన్నారు. దివ్యాంగ విద్యార్థులకు సహాయపడటం తమకు ఎంతో ఆనందం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సమాల శ్రీనివాసరావు, అడ్డూరి సత్యనారాయణపాల్గొన్నారు.

పరికరాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మశ్రీ

వెంకన్న ఆలయం అభివృద్ధికి వినతి

ప్రజాశక్తి -నక్కపల్లి : ఉపమాక వెంకన్న ఆలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయాలని కోరుతూ తిరుమల తిరుపతి దేవస్థానం జాయింట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వీరబ్రహ్మంను గ్రామస్తులు కోరారు. గురువారం ఆలయ సందర్శనకు జేఈవో వచ్చారు. ఈ మేరకు రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, జిల్లా పరిషత్ కో ఆప్షన్ మాజీ సభ్యులు కొప్పిశెట్టి కొండబాబు, వైసిపి విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు కొప్పిశెట్టి హరిబాబు, కొల్లాటి బుజ్జి, అయినవిల్లి నాగేశ్వరరావు, తాడేలు రవితేజ, తోలేటి శ్రీనివాస్ తదితరులు ఆయనను కలిసి సమస్యలను విన్నవించారు.ముఖ్యంగా స్వామివారి పుష్కరిణి, మూలవిరాట్ ఆలయం పునరుద్ధరణ, భక్తులకు విశ్రాంతి భవనాలు, మరుగుదొడ్ల నిర్మాణాలు, ఉచిత అన్నదానం తదితర విషయాలపై జేఈవో వీరబ్రహ్మంతో చర్చించారు. దేవస్థానం ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ ఆచార్యులకు టీటీడీ అధికారిక గుర్తింపు పత్రం ఇవ్వాలని కోరారు. దీనిపై టీటీడీ జేఈవో సానుకూలంగా స్పందిస్తూ త్వరలోనే ఆలయ అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. మరుగు దొడ్ల నిర్మాణానికి 15 లక్షల నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఇందుకుగాను టెండర్‌లు పిలుస్తున్నా మన్నారు. అనంతరం వీసం రామకృష్ణ ఆలయ అభివృద్ధికి సంబంధించి టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డితో జేఈఓ కు ఫోన్ చేసి మాట్లాడించారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

జేఈఓకి సమస్యలు వివరిస్తున్న గ్రామస్తులు

పలుచోట్ల చలివేంద్రాల ఏర్పాటు

మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న వంశీరెడ్డి

ప్రజాశక్తి -గాజువాక : దల్లివానిపాలెం గ్రామం ప్రధానకూడలిలో మహాత్మా మదర్ తెరిసా ఛారిటబుల్ ట్రస్ట్ జాగారపు శ్రీను ఆధ్వర్యంలో స్వర్గీయ తిప్పల చినఅప్పారావు, తిప్పల అరుణ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని 74వ వార్డు కార్పొరేటర్, వైసిపి సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ తిప్పల వంశీరెడ్డి ప్రారంభించారు. సొంతనిధులతో మూడు వేల మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వంశీరెడ్డి మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలపాటు గాజువాక వర్తక సంఘం అధ్యక్షునిగా కళాసీల సంక్షేమానికి తిప్పల చినఅప్పారావు కృషిని కొనియాడారు. అన్నార్తుల ఆకలి తీర్చడంతోపాటు ఇతరుల కష్టంలో సహాయసహకారాలు అందించే అరుణ సేవలను కొనియాడారు. వైసిపి ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మార్టూపూడి పరదేశి, దల్లి పైడికొండ, రాఘవరెడ్డి హెల్పింగ్ అండ్ ఫౌండర్ సురేష్ రెడ్డి, గొందేసి సునీల్ రెడ్డి, నవీన్ రెడ్డి, బైరెడ్డి గురుమూర్తి, దల్లి వెంకటేష్ పాల్గొన్నారు.

ఆనందపురం : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద చలివేంద్రాన్ని ట్రైనీ కలెక్టర్ కె.మాధవి ప్రారంభించారు. తహశీల్దార్ లోకవరపు రామారావు, డిటి రాజేష్, సీనియర్ అసిస్టెంట్ సాయి, ఆర్ఐ మణికంఠ, సిబ్బంది పాల్గొన్నారు.

పద్మనాభం : మండలంలోని విలాస్‌ఖాన్‌పాలెం గ్రామంలో మజ్జిగ చలివేంద్రాన్ని గురువారం ఎంపిపి కె.రాంబాబు ప్రారంభించారు. ప్రస్తుతం ఎండలు మండుతున్న పరిస్థితుల్లో ప్రజలు వడదెబ్బకు గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సర్పంచ్ నల్లి సత్యవతి, ఎంపిటిసి బోని సావిత్రి, పంచాయతీ కార్యదర్శి శివప్రసాద్, జలజీవన్ మిషన్ జిల్లా కోఆర్డినేటర్ పాల్గొన్నారు.

గొలుగొండ : కృష్ణదేవిపేట ఆర్టీసీ బస్టాండ్ వద్ద చలివేంద్రంను గురువారం సర్పంచ్ లోచల సుజాత ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి గ్రామంలో చలివేంద్రాలు ఏర్పాటు చేసుకోవాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఈఒపిఆర్‌డి రఘురామ్, కార్యదర్శి శ్రీనివాస్, రాజేష్ పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న సర్పంచ్ సుజాత

ఆకట్టుకున్న శ్రీ ప్రకాష్ విద్యార్థుల ప్రదర్శనలు

ప్రజాశక్తి -పాయకరావుపేట: స్థానిక శ్రీ ప్రకాష్ విద్యా సంస్థలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థుల కేరింతలు ప్రదర్శన ఆహుతులను ఎంతో అలరించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సాక్షి సంపాదకులు వి.మురళి, అతిథిగా వైస్ ప్రెసిడెంట్, మాన్యుఫాక్చరింగ్, డెక్కన్ ఫైన్ కెమికల్స్ ఎస్.ఆనందరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వి.మురళి మాట్లాడుతూ, విద్యార్థులకు మన సంస్కృతి సాంప్రదాయాలను తెలిసి వచ్చేటట్లుగా రూపొందించిన ఈ కార్యక్రమం కి హాజరవ్వడం ఎంతో ఆనందాన్ని కలిగించిందని తెలిపారు. విద్యార్థులను చదువుతో పాటు ఏదో ఒక రంగంలో నిష్ణాతులను చేసే విధంగా తల్లిదండ్రుల ప్రణాళిక చేస్తున్నారని ఇది శుభ పరిణామమని ఆయన తెలిపారు. ఆనందరావు మాట్లాడుతూ, నేటి తరం విద్యార్థులు అంతర్జాలం ఉపయోగిస్తూ ఆన్లైన్ గేమ్స్‌తో తమ సమయాన్ని వృథా చేస్తున్నారని తెలిపారు. విద్యార్థులకు మహనీయుల జీవిత కథలను తెలుసుకొనే విధంగా తల్లిదండ్రులు పుస్తక పఠనాన్ని ప్రోత్సహించాలని సూచించారు. అప్పుడే విద్యార్థులను ఆదర్శవంతంగా తీర్చిదిద్దగలమని తెలిపారు.

విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సి.హెచ్. విజయ్ ప్రకాష్ మాట్లాడుతూ, ప్రతీ విద్యార్థి ఏదో ఒక రంగంలో ప్రతిభ కలిగి ఉంటారని తెలిపారు. ఆ ప్రతిభా పాటవాలను వెలికి తీసి సరైన శిక్షణ ఇవ్వడంతో సదరు రంగంలో నిష్ణాతులుగా తయారవుతారని తెలిపారు.ఇందుకే జాతీయ స్థాయిలో శ్రీ ప్రకాష్ విజయాలు సాధి స్తుందన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమం లో విద్యా సంస్థల సీనియర్ ప్రిన్సిపల్ ఎం.వి.వి.ఎస్ మూర్తి, ప్రోగ్రాం కన్వీనర్ వి.ఎమ్.ఎస్ రత్నం, కో కన్వీనర్లు ప్రసూనమౌళి, సంధ్యారాణి, డి.ఎల్.పి రాజు, ఉషారాణి, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో యాజమాన్యం, సిబ్బంది

ఆందోళన చేస్తున్న మత్స్యకారులు

504వ రోజుకు మత్స్యకారుల ధర్నా

ప్రజాశక్తి -నక్కపల్లి: హెటిరో మందుల కంపెనీ కొత్తగా వేస్తున్న పైపులైన్‌కు సంబంధించి న్యాయం జరిగే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని మత్స్యకార నాయకులు స్పష్టం చేశారు. పైప్ లైన్ కు వ్యతిరేకంగా మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత మహా ధర్నా 504వ రోజుకు చేరింది. గురువారం శిబిరం వద్ద మత్స్యకారులు పైప్‌లైన్‌కు వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు మత్స్యకారులు మాట్లాడుతూ, పైపులైన్‌కు వ్యతిరేకంగా తామంతా 504 రోజుల నుండి శాంతియుతంగా ఆందోళన చేస్తున్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమస్య పరిష్కారానికి మార్గం చూపకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారులు గోసల స్వామి, చేపల సోమేష్, సత్తియ్య, గంగరాజు, కోదండరావు, బాబుజి, నూకరాజు, శివ, జాను, కాశీరావు, కాశీ, ఆదిరాజు, దాగ్రాజు పాల్గొన్నారు.

పుస్తకాలు అందజేస్తున్న రాజేష్

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి - నక్కపల్లి : మండలంలో చిన దొడ్డిగల్లు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల 1లో విద్యార్థులకు గ్రామానికి చెందిన పాలూరి రాజేష్ గురువారం పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తన తండ్రి కీర్తిశేషులు పాలూరి బాబురావు జ్ఞాపకార్థం 1వ తరగతి నుండి 5వ తరగతి వరకు చదువుతున్న 150 మంది విద్యార్థులకు సుమారుగా రూ.20 వేల విలువైన నోటు పుస్తకాలు, కథల పుస్తకాలను విద్యార్థులకు అందించడం జరిగిందన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ సెల్ ఫోన్లు పిల్లల చేతికి ఇవ్వరాదని తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం గొంతి అప్పారావు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇంచార్జ్ హెచ్ఎం విజయ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఓ

కూలీలకు పనులు కల్పించాలి

ప్రజాశక్తి -కోటవురట్ల: ఉపాధి హామీ పథకం కార్డుదారులందరికీ శత శాతం పని కల్పించాలని ఎంపీడీవో చంద్రశేఖర్ సూచించారు. గురువారం ఆయన మండల సమావేశం మందిరంలో ఉపాధి సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జాబు కార్డుదారులందరికీ శత శాతం పని కల్పించడంతో పాటు కనీస వేతనం అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పని ప్రదేశంలో కూలీలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. మండల వ్యాప్తంగా ప్రతిరోజు 5వేల మంది పని చేస్తున్నారని, వీటిని సుమారు 7వేల వరకు పెంచాలన్నారు. కనీస వేతనం 250 నుంచి వచ్చే విధంగా పనులు చేయించాలని సూచించారు. సకాలంలో వారికి వేతనాలు అందజేయాలన్నారు.

మాట్లాడుతున్న ఆర్డిఓ జయరాం

భూముల రీ సర్వే వేగవంతం

- ఆర్‌డిఒ జయరాం

ప్రజాశక్తి-నక్కపల్లి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీ సర్వే ను వేగవంతంగా పూర్తి అయ్యే విధంగా చర్యలు చేపట్టాలని నర్సీపట్నం ఆర్డిఓ జయరాం సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం నక్కపల్లి, పాయకరావుపేట, ఎస్.రాయవరం మండలాలకు చెందిన తహసీల్దార్లు నీరజ, జై ప్రకాష్ ,శ్యామ్‌లతో సమావేశం నిర్వహించారు. మండలాల వారిగా ఇప్పటి వరకు పూర్తయిన భూముల రీ సర్వేను అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పక్కాగా రీ సర్వే చేపట్టాలన్నారు. ఓటర్ కార్డుకు ఆధార్ అనుసంధానం వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. స్పందనలో వచ్చిన ఫిర్యాదులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు.

అవగాహన కల్పిస్తున్న సంస్థ నిర్వాహకులు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి-కోటవురట్ల: పర్యావరణ పరిరక్షణకు అందరూ పాటుపడాలని మండల కేంద్రంలో గురువారం సిఫా సంస్థ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. సంస్థ నుండి సచివాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కొడవట్ల సచివాలయంలో వివిధ పండ్ల మొక్కలు నాటారు, ఈ సందర్భంగా సర్పంచ్ అనిల్ కుమార్ మాట్లాడుతూ, వాతావరణంలో మార్పులు సంభవించకుండా భూపరిరక్షణకు అంతా నడుం బిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి సుబ్రహ్మణ్యం, సచివాలయం జిల్లా కోఆర్డినేటర్ ప్రసాద్, డాక్టర్ అన్నపూర్ణ, జయహెూ భారత్ రాష్ట్ర కార్యదర్శి మైలపల్లి త్రిమూర్తులు, పలువురు గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

వైద్యులు అందుబాటులో ఉండాలి

జెడ్‌పిటిసి గంగరాజు

ప్రజాశక్తి-అనంతగిరి: విష జ్వరాలు విజంభిస్తున్న నేపథ్యంలో వైద్యులు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని జెడ్పిటిసి దీసరి. గంగరాజు కోరారు. స్థానిక విలేకరులతో ఆయన గురువారం మాట్లాడుతూ, మండలంలోని అనంతగిరి, లుంగపర్తి, పిన్నకోట, భీమవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండి రోగులకు వైద్య సేవలు అందించేందుకు కృషి చేయవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గ్రామాలలో చిన్నపిల్లల నుండి పెద్దలు సైతం దగ్గు, జలుబు, విష జ్వరాలతో బాధ పడుతున్నారన్నారు. సబ్ సెంటర్ పరిధిలోని గ్రామాలలో ఆరోగ్య సూత్రాలపై గిరిజన ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కోవిడ్ మళ్లీ విజంభిస్తున్న తరుణంలో మరింత అప్రమంతంగా ఉండవలసిన అవసరం ఉందన్నారు. ఈ పరిస్థితలను దృష్టిలో పెట్టుకుని వైద్యులు, సిబ్బంది సకాలంలో స్పందించి మెరుగైన వైద్యం అందించాలని ఆయన కోరారు.

బిజెపి ప్రభుత్వాన్ని సాగనంపాలి

ప్రచార భేరిలో సిపిఎం, సిపిఐ నేతలు

ఆరిలోవలో చేపడుతున్న ప్రచారం

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తోన్న ప్రజావ్యతిరేక, ప్రయివేటీకరణ విధానాలను తిప్పి కొట్టాలని సిపిఎం, సిపిఐ నేతలు పిలుపునిచ్చారు. బిజెపిని ఇంటికి సాగనంపాలని తెలిపారు. విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో ప్రచార భేరిని గురువారం చేపట్టారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

మధురవాడ : జివిఎంసి ఏడో వార్డు డాక్‌యార్డు కాలనీ, పాకలలోనూ, ఎఎస్‌ఆర్ నగర్, గణేస్‌నగర్ ప్రాంతాల్లో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో ఏడో రోజు ప్రచారభేరి పాదయాత్ర నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 16న కూర్మన్నపాలెంలో నిర్వహించే బహిరంగ సభలో పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నేతలు డి.అప్పలరాజు, పి రాజుకుమార్, బి భారతి, డి కండమ్మ, సిపిఐ నేత వి సత్యనారాయణ, వి సన్నిపాత్రుడు, పి వెంకన్న, కుమార్ పాల్గొన్నారు.

రోలుగుంటలో..

గాజువాక : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ప్రజావ్యతిరేక, ప్రయివేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 26న సాయంత్రం నాలుగు గంటలకు కూర్మన్మపాలెంలో నిర్వహించే బహిరంగసభను విజయవంతం చేయాలని సిపిఎం, సిపిఐ నేతలు కోరారు. పెదగంట్యాడ కూడలిలోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద బహిరంగసభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రచారభేరి పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఎం నేతలు కోవిరి అప్పలరాజు, నమ్మి రమణ, పాల వెంకయ్య, కణితి అప్పలరాజు, జి శ్రీనివాసరావు, కర్రి అప్పలరాజు, నమ్మి రమణ, జి.శ్రీనివాసరావు, కవిటి అప్పలరాజు, సిపిఐ గాజువాక నియోజక వర్గ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ, ఎల్లేటి శ్రీనివాసరావు, జి.ఆనంద్, పల్లెటి పోలయ్య, పి. దుర్గారావు , పి.సోమేష్ , కె. మాధవరావు పాల్గొన్నారు.. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బిజెపికి గుణపాఠం తప్పదని వామపక్ష పార్టీల నేతలు హెచ్చరించారు. సిపిఎం, సిపిఐ నేతలు ఎం.రాంబాబు, కె.సత్యనారాయణ ఆధ్వర్యంలో కొత్తగాజువాక మార్కెట్‌లో ప్రచారభేరి పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు అప్పారి విష్ణుమూర్తి, జి.ఆనంద్, వై.నందన్న ,పప్పు అప్పారావు, వై.లక్ష్మణరావు, ఎం.రామారావు, పి.ఈశ్వరరావు, పాల్గొన్నారు.

గాజువాకలో..

ఆరిలోవ : కేంద్రంలో మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగాఆరిలోవ సెక్టార్ -4, భగత్‌సింగ్ నగర్ కాలనీలో ప్రచారభేరి పాదయాత్ర నిర్వహించారు. ఇంటింటికి వెళ్ళి కరపత్రాలు పంచుతూ గ్రూపు సమావేశాలు నిర్వహించారు. సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఎస్.కె.రెహ్మాన్ బిజెపి ప్రభుత్వ ప్రయివేటు, కార్పొరేటీకరణ విధానాలపై ఆగ్రహం వ్యక్తం చేసి, దేశరక్షణకు మోడీని గద్దె దింపాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో సిపిఎం, సిపిఐ నాయకులు వి.నరేంద్రకుమార్, కె.సత్యనారాయణ, శ్రీనివాసరావు, దేవుడమ్మ, కాసుబాబు, లక్ష్మణరావు, గోపి, సన్యాసిరావు పాల్గొన్నారు.

గొలుగొండలో..

సీతమ్మధార : అక్కయ్యపాలెం ప్రధాన రహదారిలో సిపిఎం జోన్ కన్వీనర్ రాజు ఆధ్వర్యంలో ప్రచారభేరిపాదయాత్ర నిర్వహించారు. పాదయాత్రకు పార్టీ నేతలు గౌరీష్, జ్యోతి తదితరులు నాయకత్వం వహించారు. మోడీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలు నశించాలని నినదించారు.

ఎంవిపి.కాలనీ : మద్దిలపాలెం ప్రాంతంలో సిపిఎం కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. నాయకులు వి.కృష్ణారావు, ఎల్‌జె.నాయుడు, జివిఎన్.చలపతి, కె.కుమారి, ఎం.చంటి, జివి.రమణ, ప్రదీప్, శివనాగేశ్వరరావు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్‌తో సహా అన్ని నిత్యావసర వస్తువుల ధరలనూ విపరీతంగా పెంచి, ప్రజలపై తీవ్ర ఆర్థిక భారాలు మోపుతున్న కేంద్రంలోని మోడీ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో గద్దెదింపాలని సిపిఎం సీనియర్ నాయకులు వై.రాజు పిలుపునిచ్చారు. ప్రచార భేరిలో భాగంగా పార్టీ జగదాంబ జోన్ కమిటీ ఆధ్వర్యంలో కోటవీధిలో పాదయాత్ర నిర్వహించి, ఇంటింటికీ కరపత్రాలు అందించారు. నాయకులు జి.అప్పలరాజు, కె.సంతోష్ కుమార్, ఎం.సుబ్బారావు, కె.నరసింగరావు, రామారావు, చంద్రమౌళి పాల్గొన్నారు.

కె.కోటపాడు : కేంద్రంలో బిజెపి ప్రభుత్వం బడా పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తుందని సిపిఎం మండల నాయకులు ఎర్ర దేవుడు అన్నారు. మండలంలోని సింగన్న దొర పాలెం శివారు కొత్తూరు గ్రామంలో గురువారం ప్రచార భేరి కార్యక్రమంలో భాగంగా ఉపాధి కూలీలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గడచిన 9 సంవత్సరాలలో కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అదాని, అంబానీలకు రూ.16 లక్షల కోట్లు దోచిపెట్టిందని తెలిపారు. 2014లో రూ.300 ఉన్న గ్యాస్ ధర నేడు రూ.1200 బిజెపి ప్రభుత్వం పెంచిందన్నారు. రాష్ట్రంలో అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి, జనసేన పార్టీలు మోడీ ప్రభుత్వానికి సలాం చేస్తున్నాయని, విభజన హామీలు అమలు చేయకపోయినా ఆ పార్టీలు మాట్లాడటం లేదని విమర్శించారు. దొంగల జగ్గారావు, వేచలపు దేవుడు బాబు, దొంగల రామలక్ష్మి, దేవుడమ్మ, రామునాయుడు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

రోలుగుంట: ప్రజావ్యతిరేకి బిజెపి ప్రభుత్వాన్ని సాగనంపాలని సిపిఎం నాయకులు ఈరెల్లి చిరంజీవి పిలుపునిచ్చారు. సిపిఎం ఆధ్వర్యంలో రోలుగుంట, రత్నంపేట, శరభవరం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం చిరంజీవి మాట్లాడుతూ, కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వ లేదన్నారు. రైతులకు గిట్టుబాటు ధర లేదని, నిత్యావసర ధరలు రోజురోజుకీ పెరుగు తున్నాయన్నారు. గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలు ప్రజలకు భారంగా మారాయని తెలిపారు. స్టీల్‌ప్లాంట్, ఎల్‌ఐసి, బిఎస్‌ఎన్‌ఎల్ ప్రైవేటుపరం చేయడానికి ప్రయత్నిస్తుందని విమర్శించారు. ఇటువంటి ప్రజా వ్యతిరేక విధానాల అమలు చేస్తున్న బిజెపిని గద్దె దించి బుద్ధి చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మల్లేష్, లక్ష్మి, ప్రకాష్, జగదీష్ పాల్గొన్నారు.

గొలుగొండ: జోగంపేట, గొలుగొండలో వామపక్షాల ప్రచార బేరిలో భాగంగా కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు, సిపిఎం జిల్లా కమిటీ డి.సత్తిబాబు మాట్లాడుతూ,మోడీ ప్రభుత్వం దేశానికి చేస్తున్న నష్టాన్ని ప్రజలందరికీ వివరించాలన్నారు. పోర్ట్, రైల్వే, బిఎస్ఎన్ఎల్, ఎల్ఐసి, స్టీల్ ప్లాంట్, బ్యాంకులు ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేటీకరణ చేయడం అనేది చాలా సిగ్గు చేటన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎ.ల్‌వి.రమణ, సిపిఎం రైతు సంఘం నాయకులు సాపిరెడ్డి నారాయణమూర్తి, సీపీఐ మండల కార్యదర్శి మేకా భాస్కరరావు, ఏఐవైఎఫ్ నాయకులు జి.రాధాకృష్ణ, పి.బాలరాజు, ఎల్.బాబులు, ఎన్.రాంబాబు, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడులో ప్రచారం.

మద్దిలపాలెంలో..

మధురవాడలో..